J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 నెల్లూరు, 04.12.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 27 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerpatrika.com

# కోటి ఆశల నడుమ కోవిడ్ టీకా!




- భరోసా కల్పిస్తున్న భారత ప్రధాని మోడీ
- సత్ఫలితాలొస్తున్నాయంటున్న ఔషధ సంస్థలు

**కరోనాని కట్టడి చేసే టీకా(వ్యాక్సిన్) వచ్చేస్తోంది. అమెరికా, రష్యా, యుకె వంటి దేశాలతో పాటు మరికొన్ని దేశాలలో అందుబాటులోకి రానున్న కోవిడ్ నివారణ ఔషధం త్వరలో మనదేశంలో కూడా లభించబోతుందన్నది మాత్రం స్పష్టమవుతోంది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వంనుండి ఇప్పటివరకూ ఎక్కడా అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ, కోవిడ్ టీకాని ప్రజలకు అందించే సన్నాహాలు మాత్రం శరవేగంగా జరిగిపోతున్నాయన్న వార్తలు గుప్పుమంటున్నాయి.**

కోవిడ్ నివారణ టీకా తయారు చేయడం కోసం పరిశోధనలు చేస్తున్న మూడు ప్రధాన ఔషధ తయారీ కేంద్రాలను భారత ప్రధాని నరేంద్ర మోడీ నవంబర్ 29న సందర్శించడం, గుజరాత్, తెలంగాణ, మహారాష్ట్రలలో జరిగిన ఆయన పర్యటనకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత కల్పించకుండా, కేవలం కరోనా నివారణ టీకాపై పరిశోధనలు ఏ దశలో ఉన్నాయో తెలుసుకోవడమే లక్ష్యంగా మాత్రమే ఆయన టూర్ కొనసాగడం భారతీయులలో కోటి ఆశలు రేకెత్తిస్తున్నాయి. డిసెంబర్ 4వ తేదీ దేశ ప్రజలనుద్దేశించి ప్రధాని ప్రసంగిస్తారన్న వార్త కూడా భారతీయులకు ఊరట కలిగిస్తోంది. ప్రధాని ఖచ్చితంగా టీకా పైనే మాట్లాడతారనే భావన ఎక్కువ మందిలో కనపడుతోంది.

ఇతర దేశాలతో పోలిస్తే... మన దేశంలో కరోనాని కట్టడిచేయడంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్రప్రభుత్వాలు కూడా (మిగతా 10వ పేజీలో)

# ఉనికి కోసం పాట్లు..'దేశం' సర్కస్ ఫీట్లు



- ➤ అసెంబ్లీ వేదికగా బాబు దిగజారుడు రాజకీయాలు
- ➤ 'సైకిల్' గాలి తీస్తున్న సీఎం
- ➤ శీతాకాల సమావేశాల్లో వాడివేడిగా మాటల దాడి
- ➤ బాబుని బఫూన్‌ను చేసిన జగన్

నలభై సంవత్సరాల ఇండస్ట్రీ, పద్నాలుగున్నరేళ్ళు ముఖ్యమంత్రిగా పనిచేసిన అనుభవం అన్నీ నేల పాలయ్యాయి, నలభైఏడేళ్ల యువ ముఖ్యమంత్రి చేతిలో చిక్కి గిలగిలా కొట్టుకుంటున్నాయి. తాను మహా మేధావినని తనకు తానే తరచూ చెప్పుకునే తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శీతాకాల సమావేశాల్లో బఫూన్‌గా మార్చేశాడు. తన ఉనికిని కాపాడుకునే ప్రయత్నంలో బాబు సర్కస్ ఫీట్లతో అభాసుపాలై, సర్కస్‌లో జోకర్‌లా మారి సభలో నవ్వులపాలయ్యాడు. నవంబర్ 30వతేదీ శాసనసభ శీతాకాల సమావేశాలు మొదలైన రోజునుండి ప్రతిరోజూ బాబు & కో సభలో గందరగోళాన్ని సృష్టిస్తూనే ఉన్నారు, చంద్రబాబైతే సహనం కోల్పోయి తన స్థాయి కూడా మర్చిపోయి ఏకంగా నేలపై కూర్చుని తన ప్రతిష్టను తానే పూర్తిగా దిగజార్చేసుకున్నాడు.

## పథకం ప్రకారం తొలి రోజు ....


సోమవారం నాడు జరిగిన సంఘటనతోనే బాబు ఆంతర్యం బట్టబయలైపోయింది, నివర్ తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారంపై తమ పార్టీ సభ్యుడు మాట్లాడుతుండగానే మధ్యలో బాబు కల్పించుకోవడంతో అభ్యంతరం చెప్పిన సభాపతి పైన విరుచుకుపడ్డాడు. గోరంతను కొండంతగా చేసి సభలో రాద్ధాంతాన్ని సృష్టించి నేలపై చతికల పడ్డాడు. రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు ఇలాంటి సంఘటన జరగలేదు, ఇంగ్లీషు సరిగ్గా రాని బాబు ఫ్లోర్ లీడర్ అంటే ఫ్లోర్ పై కూర్చోవాలని అనుకున్నట్టున్నాడు, గతంలో అన్నేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన తన హోదా, నలభైఏళ్లుగా రాజకీయాలలో ఉన్న తన సీనియారిటీ అన్నీ మర్చిపోయి తన పార్టీని, పరువుని తనకుతానే నేలపైకి తెచ్చేశాడు. ఈ సంఘటనతో బాబు ఎత్తుగడ ఏమిటో అర్ధమైపోయింది, సభను జరగకుండా చేయడమే కాకుండా తాను వ్యక్తిగతంగా ఎలా మీడియాలో (మిగతా 10వ పేజీలో)



## • మాగుంట 25వ వర్ధంతిలో వారసులు

# సుబ్బరామరెడ్డికి ఘన నివాళి





మంచితనానికి, మానవీయతకు మారుపేరుగా ఒక్క నెల్లూరు ప్రకాశం జిల్లాలలోనే కాకుండా యావత్ భారతదేశంలో మాగుంట కుటుంబానికి గుర్తింపు తీసుకొచ్చిన మాజీ పార్లమెంటు సభ్యుడు, సేవాతత్పరుడు మాగుంట సుబ్బరామరెడ్డి 25వ వర్ధంతి డిసెంబర్ 1వతేదీ నెల్లూరు, ప్రకాశం జిల్లాలలో ఘనంగా జరిగింది. వ్యాపారవేత్తగానే కాకుండా, ప్రజా సేవకుడిగా, రాజకీయ నాయకుడిగా సుబ్బరామరెడ్డి అపార కీర్తి ప్రతిష్టలు సంపాదించాడు. తాను చేపట్టిన ప్రతి కార్యక్రమాన్నీ ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకునేవాడు, నెవెర్ బిఫోర్ ఎవర్ ఆఫ్టర్ అన్నట్లుగా నిర్వహింపజేసేవాడు.

### కావలి, నెల్లూరుల్లో నివాళి అర్పించిన జూనియర్ మాగుంట సుబ్బరామరెడ్డి

డిసెంబర్ 1వ తేదీ సుబ్బరామరెడ్డి 25వ వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరు రాఘవ కల్యాణ మండపంలో జరిగిన నివాళి కార్యక్రమంలో సుబ్బరామరెడ్డి మనుమడు జూనియర్ సుబ్బరామరెడ్డితో పాటు సుబ్బరామన్న కోడలు మమత, ఇతర కుటుంబ సభ్యులు, మాగుంట కుటుంబ అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కావలిలో పర్యటించిన జూనియర్ సుబ్బరామిరెడ్డి సుబ్బరామన్న స్మృత్యంకంగా జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొని కొన్ని చోట్ల తన తాత విగ్రహాలకి మరికొన్ని చోట్ల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించాడు. తమ తాత స్మృత్యంకంగా ప్రసాద వితరణ చేశాడు. ఆయన వెంట కావలి నియోజకవర్గానికి చెందిన పలువురు మాగుంట అభిమానులు వున్నారు.

### ఒంగోలులో శీనయ్యతో కలసి పాల్గొన్న మాగుంట రాఘవరెడ్డి

ఒంగోలులో పలు చోట్ల జరిగిన సుబ్బరామరెడ్డి వర్ధంతి కార్యక్రమాల్లో ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డితో పాటు ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి పాల్గొన్నాడు. తండ్రితో కలసి తన పెదనాన్నకి రాఘవరెడ్డి నివాళు లర్పించాడు. ఒంగోలు పట్టణంలోని అభిలాష్ సెంటర్, రైల్వే స్టేషన్ రోడ్, అద్దంకి బస్టాండ్ సెంటర్లలో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి అనంతరం రాంనగర్‌లోని మాగుంట నివాసంలో నివాళి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైసిపి నాయకులు, మాగుంట అభిమానులు, జిల్లా అధికారులు పాల్గొని సుబ్బరామరెడ్డిని సంస్మరించుకుని జిల్లా వాసులకు ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు.

నెల్లూరులో మనుమడు సుబ్బరామరెడ్డి, ఒంగోలులో తమ్ముడి కుమారుడు రాఘవరెడ్డి ఈ వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనడంతో మాగుంట వారసులొస్తున్నారన్న ఆశాభావం ఇటు నెల్లూరు అటు ప్రకాశం జిల్లాల మాగుంట అభిమానుల్లో వ్యక్తమవుతోంది.



# గురునానక్ జయంతిలో సిఎం జగన్

గురునానక్ 551వ జయంతిని పురస్కరించుకుని నవంబర్ 30వ తేదీ సోమవారం విజయవాడ గురునానక్ కాలనీలోని గురుద్వారలో గురుపూరబ్ ఉత్సవంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఆ వేడుకలలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిఎం జగన్ వారి ఆచారాన్ని పాటించి ఈ విధంగా కనిపించారు.

## బాధితుల చెంతకు..

# పడవపై వెళ్లిన ప్రసన్న

- వరదనీటిలో చిక్కుకున్న ఎమ్మెల్యేని రక్షించిన మత్స్యకారులు
- తుఫాన్‌లో కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న సాహసం



ప్రజాక్షేమం కోసం ప్రజాప్రతినిధులు తపనపడుతూ సాహసాలు చేసిన సంఘటనలు బహు అరుదైనవి. అందులోనూ వానలు వరదలు వచ్చినప్పుడు అనేకమంది నాయకులు కదలకుండా ఇళ్ళలోనే ఉంటుండడం మనకు తెలిసిందే. అయితే వైకాపా నాయకులు మాత్రం అలా కాకుండా తమను నమ్ముకుని ఓట్లేసిన ప్రజలు ఇబ్బందుల్లో ఉంటే ఇళ్ళల్లో కూర్చునేందుకు మనసు రాక..వెంటనే వెళ్ళి వారిని ఆదుకునేందుకు తమవంతు సాయం అందిస్తుండడం విశేషం. మొన్నటి నివర్ తుఫాన్ అలాంటి సంఘటనలను ఎన్నిటినో బాధితుల కళ్ళకు కట్టింది. తుఫాన్‌తో ఈదురుగాలులు, ఆపై భారీ వానలు.. తీరప్రాంతాల్లో కొన్ని ఊళ్ళు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయనే సమాచారం కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకు చేరింది. అంతే, ఇక ఏమాత్రం ఆలోచించకుండా ఆయన వెంటనే ఎంతో ఆతృతతో బాధితులను ఆదుకునేందుకు ఉద్యుక్తులయ్యారు. కోవూరు నియోజకవర్గంలోని విడవలూరు మండలంలో పెన్నానది వరదనీటిలో చిక్కుకుపోయిన ఊటుకూరు పల్లిపాళెం, వెంకటరెడ్డిపాళెం, పెద్దపాళెం గ్రామాల్లో పర్యటించడానికి హుటాహుటిన బయలుదేరారు. అప్పటికే ఆ గ్రామాల్లో ప్రమాదకరమైన స్థాయిలో వరదనీరు పెల్లుబుకుతోంది.

అయినప్పటికీ ఎమ్మెల్యే ప్రసన్న తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పడవ ఎక్కి ప్రజలను కలుసుకునేందుకు, వారిని ఈ ఆపద నుంచి రక్షించేందుకు అధికారులను తీసుకుని ఆ గ్రామాలకు వెళ్లారు. ఆ గ్రామాలు నిండా నీటిలో ఉండడం, ఇళ్ళల్లోకి నీళ్ళు రాగా ఏంచేయాలో దిక్కుతోచక ప్రాణాలు ఉగ్గబట్టుకుని గట్ల మీద కూర్చుని ఉన్న ప్రజలను పరామర్శించారు. వారికి 'నేనున్నా'నంటూ ధైర్యం చెప్పారు. బాధితులందరికీ అవసరమైన సాయం అందించేందుకు అప్పటికప్పుడు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కూడా హఠాత్తుగా వరదనీటిలో చిక్కుకుపోవడంతో ఒక్కసారిగా అందరిలో ఆందోళన నెలకొంది. ఉన్నట్లుండి నీటి ప్రవాహం బాగా ఎక్కువ కావడం, ఆ ప్రవాహం నుంచి బయటకు వచ్చేందుకు అవకాశం లేకపోవడంతో స్థానిక వైకాపా నాయకులతో పాటు ప్రజల్లోనూ ఆందోళన ఎక్కువైంది. ఎట్టకేలకు మత్స్యకారుల సహాయంతో జలదిగ్బంధనం నుంచి ఆయన బయటపడ్డారు. వరద నీటి ఉధృతి వల్ల ఎంతగానో శ్రమించి మత్స్యకారులు ఎమ్మెల్యేని గట్టుకుచేర్చారు. ఆయనతో పాటు వెళ్ళిన అధికారులను, మీడియా ప్రతినిధులను కూడా మత్స్యకారులు రక్షించి ఒడ్డుకు తీసుకు వచ్చారు. ఏదేమైనా తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమను పరామర్శించడానికి ఎంతో కష్టపడి పడవలో వచ్చిన ఎమ్మెల్యే ప్రసన్నకు స్థానిక ప్రజలు నిండుమనసుతో కృతజ్ఞతలు చెప్పారు.

# పనబాక లక్ష్మిని గెలిపించుకుందాం

### - టిడిపి నేత, మాజీ మంత్రి సోమిరెడ్డి



రానున్న ఉప ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ సత్తా చూపుతుందని, నాయకులమంతా ఐక్యంగా పనిచేస్తామని, తిరుపతి ఎంపిగా పనబాక లక్ష్మిని గెలిపించుకుందామని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 2న ఆయన నాయుడుపేటలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించి టిడిపి నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. అసెంబ్లీలో ప్రతిపక్ష సభ్యులు గొంతెత్తితే సస్పెండ్ చేసి బయటకు గెంటేస్తున్నారని, ఈ ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం తీరు ఇలా ఉందని ఆయన దుయ్యబట్టారు. టిడిపి హయాంలో రైతుల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తూ రైతులను ఆదుకున్నామని, ఇప్పుడు వైకాపా పాలనలో రైతుల అవస్థలు పట్టించుకునేవారే లేరని, సాధారణ పరిపాలన కూడా కరువైందని విమర్శించారు. ఈ ఏడాదిన్నరలో ప్రజలు పడిన కష్టాలకు ఫలితం తిరుపతి ఉప ఎన్నికల్లో చూడబోతున్నామని, పనబాక లక్ష్మిని గెలిపించుకుందామని అన్నారు.

# 'గుడిపాటి'కి డా. నాగభైరవ సాహితీ పురస్కారం



హైదరాబాదుకు చెందిన ప్రముఖ రచయిత, పాలపిట్ట సాహితీ మాసపత్రిక సంపాదకులు 'గుడిపాటి' రచించిన 'పుట్ట బంగారం' 2019 నాగభైరవ కోటేశ్వరరావు స్మారక సాహితీ పురస్కారానికి ఎంపికయింది. సాహితీ విమర్శ గ్రంథాల పోటీ నిర్వహించిన డా॥ నాగభైరవ అవార్డు కమిటి అధ్యక్ష కార్యదర్శులు వెన్నెలకంటి, చిన్ని నారాయణరావులు ఒక సంయుక్త ప్రకటనలో విజేతల్ని ప్రకటించారు. గుడిపాటికి రూ.5,000/-లు నగదు పురస్కారం, సత్కారం ఉంటాయని తెలియజేశారు. ప్రథమ విజేతతో బాటు మరో ముగ్గురికి ప్రత్యేక బహుమతుల్ని ప్రకటించారు. విజయనగరానికి చెందిన రెంటాల శ్రీ వెంకటేశ్వరరావు రచించిన 'ఒలుపు', అనంతపురానికి చెందిన డా॥ అమళ్ళదిన్నె వెంకటరమణ ప్రసాద్ రచించిన 'అనంతపద్యం', మార్కాపురానికి చెందిన కె.వి.రమణారెడ్డి 'అద్దేపల్లి శ్రీశ్రీ కవితా ప్రస్థానం' ఎంపికచేసినట్లు చెప్పారు. విజేతలైన రచయితలకు రూ.1,000/-లు నగదు పురస్కారం మరియు సత్కారం ఉంటాయన్నారు. త్వరలో జరుగబోయే డా॥ నాగభైరవ 10వ అవార్డు సభలో వీరందరినీ సత్కరిస్తామని వారు తెలిపారు. మేడిపల్లి రవికుమార్(తిరుపతి), మోపూరు వేణుగోపాలయ్య(నెల్లూరు) న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారని చెప్పారు. తమ కమిటీ నిర్వహించిన పోటీలో పాల్గొన్న రచయిత లందరికీ వారు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

### డ్వామా పీడీగా తిరుపతయ్య

గూడూరు అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉన్న ఎం.తిరుపతయ్యను డెప్యుటేషన్‌పై జిల్లా నీటి యాజమాన్యసంస్థ(డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమిస్తూ ఈనెల2న అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. డ్వామా పీడీగా పనిచేస్తున్న కెవి సాంబశివారెడ్డిని డిఆర్ డిఏ పీడీగా బదిలీ చేశారు.



# పొలాల్లో పవర్‌స్టార్

జనసేన అధినేత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ డిసెంబర్ 2వ తేదీ బుధవారం నుండి వరదప్రాంతాలలో పర్యటనకు బయలుదేరాడు. తన పర్యటనలో భాగంగా ముందుగా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో వరదలతో దెబ్బతిన్న పొలాలను పరిశీలించాడు.

2, 3 తేదీల్లో ఆ జిల్లాల్లో పర్యటించిన ఆయన 3వ తేదీ సాయంత్రానికి తిరుపతి చేరుకున్నాడు. 3, 4, 5 తేదీలలో చిత్తూరు, నెల్లూరు జిల్లాల్లో పర్యటించనున్నాడు.



### తమిళనాట

# 'తలైవా' కొత్త పార్టీ

'ఎన్నాళ్ళో వేచిన ఉదయం ఈనాడే నిజమవుతుంటే' అని ఒక సినీకవి చెప్పినట్లుగా.. ఎన్నాళ్ళుగానో ఎదురుచూస్తున్న తన అభిమానులకు ఎట్టకేలకు తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ శుభవార్త చెప్పాడు. ఇన్నాళ్ళు ఆ పైవాడు ఆదేశిస్తాడు ఈ క్రింది వాడు ఆచరిస్తాడు అంటూ ముందుకీ వెనక్కి ఊగిసలాడుతుండిన రజని జనవరిలో తాను కొత్త పార్టీ పెట్టబోతున్నట్లు ట్విట్టర్

(మిగతా 10వ పేజీలో)

### • తిరుపతిలో దీపోత్సవం

# కార్తీక శోభ తెచ్చిన కంచి స్వామి



నవంబర్ 30వ తేదీ కార్తీక సోమవారం సందర్భంగా తిరుపతిలోని టిటిడి పరిపాలనా భవనం ప్రాంగణంలోని మైదానం కార్తీక దీపోత్సవంతో కకళలాడింది. కంచి కామకోటి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి ప్రత్యేక అతిథిగా పాల్గొని తొలి దీపం వెలిగించారు. స్వామివారి ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు నేతి దీపాలను వెలిగించారు. తిరుమల తిరుపతి దేవస్థానాలకు చెందిన అనేకమంది అధికారులు అనేకమంది భక్తులు ఈ  కార్యక్రమంలో పాల్గొన్నారు.

### జివికె దాతృత్వంతో.. వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో

# పేదప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు

ఒకవైపు కరోనా, మరోవైపు అనేక రకాల సీజన్‌వ్యాధులు జిల్లాను చుట్టుముడుతున్న నేపథ్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త జివికె దాతృత్వంతో.. వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో పేదప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. మానవసేవే మాధవసేవ అనే భావంతో పేదలకు తమవంతు సాయం అందించి వీరు తమ సేవాభావాన్ని చాటుకున్నారు. నెల్లూరు నగరంతో పాటు నెల్లూరు చుట్టుపక్కల ఉన్న గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించిన ఈ ఉచిత వైద్య శిబిరాలకు పెద్దసంఖ్యలో రోగులు తరలి వచ్చి ఆరోగ్య పరీక్షలు చేయించుకుని వైద్యుల నుంచి తగు సలహాలు సూచనలు అందుకున్నారు. ఈ సందర్భంగా  వైద్యులు పలు వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలను వివరిస్తూ ప్రజలకు అవగాహన కలిగించారు.  నవంబరు 7 నుంచి 30వ తేది వరకు నిర్వహించిన ఈ వైద్య శిబిరాలకు సుమారు రెండువేలా అయిదు వందల మందికి పైగానే పేదరోగులు వచ్చి వైద్యపరీక్షలు చేయించుకోవడం విశేషం. వీరందరికీ అవసరమైన మందులను నిర్వాహకులు ఉచితంగా పంపిణీ చేశారు. గతనెల 7 నుంచి 30వ తేది వరకు ఏర్పాటుచేసిన 12  వైద్య శిబిరాలకు పెద్దసంఖ్యలో రోగులు తరలిరావడం విశేషం. మాతా శిశు సంరక్షణ కార్యక్రమంలో భాగంగా గతనెల 9న చెన్నారాయుడుపాళెం గ్రామంలోనూ, 11న వేగూరులోను, 13న వసంతపురం, 14న కాంచనపురం, 16న చెరుకుతోట, 18న సీతారామపురం, 19న కంద్రిగ, 21న కోవూరు పిఆర్ కాలనీ, 23న శాంతినగర్, 25న మిక్స్‌డ్‌కాలనీ, 27న లక్ష్మీపురం, 30న లేగుంటపాడు గ్రామాల్లో ఈ వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. పేదప్రజల ఆరోగ్యసంరక్షణ కోసం, ముఖ్యంగా ఎస్సి, ఎస్‌టి, మైనార్టీలు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల ప్రజలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి  వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయాలని జివికె ఫౌండేషన్ సత్సంకల్పానికి ఆలంబనగా నగరంలోని వసంతలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అండ్ రీసెర్చి సెంటర్ ముందుకువచ్చి పేదప్రజలకు ఈ సేవాకార్యక్రమాలు నిర్వహించడంతో ఈ సంస్థల సేవాభావం అందరి అభినందనలు అందుకుంది.




### ముంపు బాధితులకు..

# మంత్రి అనిల్ సొంత నిధులతో బియ్యం



నెల్లూరు నగర నియోజకవర్గంలో ముంపునకు గురైన ప్రాంతాల్లో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్ తన సొంత నిధులతో ప్రతి ఇంటికి 10 కేజీల బియ్యం పంపిణీ చేయిస్తున్నారు. ఈనెల 1న నగరంలోని 5వ డివిజన్‌లో మాజీ డెప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, మాజీ కార్పొరేటర్ ఓబిలి రవిచంద్రతో కలసి బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ద్వారకానాథ్ మాట్లాడుతూ తుఫాన్ బాధితులకు మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ మూడురోజుల పాటు భోజనవసతి ఏర్పాటుచేశారని, ఇప్పుడు తన సొంతనిధులతో ప్రతి ఇంటికీ 10 కేజీల బియ్యం ఇవ్వడం ఆయన సేవాభావానికి నిదర్శనమని అన్నారు. 54వ డివిజనల్ భగత్‌సింగ్ కాలనీలో స్థానిక వైకాపా నాయకులు ఇంటింటికీ బియ్యం అందజేశారు.

### ప్రభుత్వ బళ్ళలో..

# జేసీ పిల్లలు

### జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదర్శం



ప్రభుత్వ అధికారులుగా పనిచేస్తూ తమ పిల్లలను పెద్దస్థాయిలో కార్పొరేట్ స్కూళ్ళలో చేర్పించేవారు ఎందరో ఉన్న ఈ రోజుల్లో ప్రభుత్వ బడుల్లోనే తమ పిల్లలను చేర్పించి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.ప్రభాకర్‌రెడ్డి అందరికీ మార్గదర్శకమయ్యారు. ఆయన కుమార్తె ఎన్.అలెక్స్ శృతిని నెల్లూరు దర్గామిట్టలోని జడ్పీ హైస్కూల్‌లో 6వ తరగతిలో చేర్పించి, కుమారుడైన ఎన్.క్రిష్‌దర్శన్‌రెడ్డిని వేదాయపాళెంలోని మునిసిపల్ హైస్కూలులో 4వ తరగతిలో చేర్పించడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. ప్రభుత్వంలో పనిచేస్తూ ప్రైవేట్ కార్పొరేట్ స్కూళ్ళ వైపు చూసే అధికారులకు, ప్రభుత్వ సిబ్బందికి జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదర్శంగా నిలిచి అందరి అభినందనలు అందుకుంటున్నారు.

### కాషాయ మాస్కుతో...

# ఓటేయడానికి వచ్చిన రాములమ్మ



హైదరాబాదులో డిసెంబర్ 1 మంగళవారం జరిగిన గ్రేటర్ ఎన్నికలలో ఓటు వేయడానికి వచ్చిన లేడీ అమితాబ్ విజయశాంతి కాషాయ రంగు మాస్కుతో ఆకట్టుకుంది. ఆమె బిజెపి తీర్థం పుచ్చుకోబోతోందని ఇప్పటికే సంకేతాలు ఉన్నప్పటికీ, రాములమ్మ కాషాయ రంగు మాస్కు ధరించి రావడంతో అది ఖరారైపోయింది.




48వ వర్ధంతి

మా తండ్రిగారైన
శ్రీకంటి వెంకటరత్నం గారు
దైవసన్నిధి చేరి 48 సం॥లు గడిచినా
మీ జ్ఞాపకాలు మా మదిలో
చిరస్థాయిగా నిలిచేవుంటాయి.
మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
భగవంతుని ప్రార్థిస్తూ..

స్వర్గీయ శ్రీకంటి వెంకటరత్నం గారు
ఆడిటర్ & కవి
మరణం : 2-12-1972

కుమారులు - కోడళ్ళు
శ్రీకంటి రామమోహన్‌రావు - రాజ్యలక్ష్మి
శ్రీకంటి రమణమూర్తి - సీతమ్మ
- మాలతి

కుమార్తెలు - అల్లుళ్ళు
యరగుడిపాటి వసంత - ప్రభాకరరావు
మద్దాలి వసుప్రద - వెంకటకృష్ణారావు
కారుమంచి ఇందిర - -

మనుమరాలు - మనుమడు
వెంకటమంజుప్రీతి - కామేశ్వర్
మునిమనుమడు
ఆర్యన్

S.V. రత్నం & కో. స్టాఫ్, గూడూరు

## 'ప్రభా'తం

# అడుగడుగునా అవినీతి

**మనదేశంలో నానాటికీ అవినీతి, లంచగొండితనం పెరిగిపోతున్నాయి. ప్రభుత్వాలు వాటి నిరోధానికి గట్టి చర్యలు తీసుకుంటు న్నామని చెప్తున్నప్పటికీ ఆచరణలో అవి మరింతగా వీరవిహారం చేస్తున్నాయి. తాజాగా అవినీతిపై విశ్లేషణ జరిపే ఒక అంతర్జాతీయ సంస్థ జరిపిన సర్వేలో కూడా ఆసియా దేశాల్లోకెల్లా భారత్‌లోనే అవినీతి అత్యధికంగా ఉందని తేల్చింది. ఇకనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని అవినీతిపై ఉక్కుపాదం మోపాలి. అవినీతిని, లంచగొండితనాన్ని రూపుమాపడానికి మరిన్ని గట్టి చర్యలకు, ప్రణాళికలకు పదునుపెట్టాలి.**

ఎంతో ప్రాచీనకాలం నుంచి ధర్మబద్ధమైన దేశంగా, శాంతి సహనాలతో పాటు నీతి నిజాయితీలకు ప్రతీకగా వెలుగొందుతున్న భారతావని క్రమేణా అవినీతి రొచ్చులో కూరుకుపోతోంది. ఇటీవలి కాలంలో దేశంలో ఎక్కడ చూసినా అవినీతి రాకాసి జడలు విచ్చుకుంటోంది. బంధుప్రీతి, ఆశ్రితపక్షపాతం, లంచగొండితనం తదితర జాఢ్యాలు పెచ్చుమీరిపోతున్నాయి. ఏదో ఒక విధంగా ధనార్జన చేయాలన్న తపనే తప్ప, నీతి నిజాయితీలతో పనిచేయడం ద్వారా ధర్మబద్ధమైన ఆర్జన చేయాలన్న తత్వం రానురాను కొడిగట్టిపోతోంది. ధనం ఎలా సంపాదించామని కాక.. ఎంత సంపాదించామన్నదే ముఖ్యం.. అన్నట్లుగా తయారైంది పరిస్థితి. అందువల్లనే సమాజంలో ఎక్కడ చూసినా అవినీతి తాండవిస్తోంది. అవినీతీ నీవెక్కడ?.. అంటే 'ఇదిగో ఇక్కడే ఉన్నాగా'.. అన్నట్లుగా, అవినీతి సర్వాంతర్యామి అయిపోతోంది. ఎక్కడో ఏ కొద్ది శాతంగానో నీతి.. అక్కడక్కడా మినుకు మినుకుమంటోంది. అవినీతి మకిలి అంటని మహానుభావులు ఎందరో ఉన్నప్పటికీ, అలాంటి మంచివారిని మించి అవినీతిపరులే అధికమైతే మొత్తంగా అవినీతిదే రాజ్యమైపోతుంది. అందువల్లనే అవినీతిని ఎక్కడికక్కడ తుంచేయాలి. నీతి నిజాయితీలను మరింతగా పెంపొందించుకోవాలి. ఇప్పుడు మనదేశంలో తక్షణం జరగాల్సింది ఇదే.

ఇప్పటికే మన దేశంలో అవినీతి నిరోధానికి, లంచగొండుల ఆట కట్టించడానికి ఎన్నో గట్టి చట్టాలున్నాయి. అయినప్పటికీ పరిస్థితిలో మార్పు ఉండడం లేదు. అవినీతిని అంతం చేసేస్తామని ప్రభుత్వాలు, పాలకులు గొప్పగా చెప్పుకుంటున్నప్పటికీ ఆచరణలో మాత్రం అవినీతి అంతకంతకు పెరిగిపోతూనే ఉంది. ఎవరెన్ని చర్యలు తీసుకుంటున్నా అవినీతి జాఢ్యం మాత్రం ఇంకా పూర్తిస్థాయిలో సమసిపోకపోవడమే విచారకరం. అదే మనదేశానికి పెద్ద అప్రదిష్టగా తయారవుతోంది.

ఇటీవల అంతర్జాతీయస్థాయిలో 'గ్లోబల్ కరెప్షన్ బ్యూరో ఏషియా' పేరుతో అవినీతిపై విశ్లేషణ జరిపే 'ట్రాన్స్‌పెరెన్సీ ఇంటర్నేషనల్' అనే ఓ సంస్థ లంచగొండితనంపై సర్వే చేస్తే..ఆసియా దేశాల్లోకెల్లా భారతదేశంలోనే లంచగొండితనం అత్యధికంగా ఉందని తేల్చింది. భారత్‌లో ఇదొక అంటువ్యాధిలా భయంకరంగా పాకుతోందని, చేతులు తడిపితే తప్ప ఫైల్స్ కదలవని, అధికారుల అనవసర జోక్యం, అస్పష్టమైన నిబంధనలు వగైరాలన్నీ దాటి ప్రజలు తమ పనులు చేయించుకోవడానికి లంచాలే మార్గంగా మారుతున్నాయని, ఎక్కువమంది ప్రజలు వ్యక్తిగత పరిచయాలు, సంబంధాల ద్వారానే పనులు చేయించుకుంటున్నారని, ఆ పనులు చేయడానికి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నారని ఆ సర్వే బట్టబయలు చేసింది. అవినీతి, లంచగొండితనం వంటివి దేశానికి ఎంత తలవంపులు తెస్తున్నాయో చూడండి. సర్వేలో బయటపడిందని కాదు కానీ, దేశంలో ఎంతోకాలం నుంచి అవినీతి వీరవిహారం చేస్తూనే ఉంది. అది ఇప్పుడు చాపకింద నీరులా మరింతగా పెరిగిపోతోందన్నదే అందరి ఆవేదన. లంచం ఇస్తే తప్ప పనులు జరగకపోతుండడం అవినీతి విషసంస్కృతి ఇంకా పెరిగిపోతున్నదనడానికి ఒక నిదర్శనం.

ఈ లంచాల సమస్యతోనే పేదలు, సామాన్యప్రజలు అనేక బాధలు పడుతుండడం అందరికీ తెలిసిందే. ఆ సర్వే ప్రకారం భారత్‌లో లంచగొండితనం 39శాతం దాకా ఉందని, జపాన్‌లో మాత్రం లంచగొండితనం అత్యంత తక్కువగా కేవలం రెండుశాతం మాత్రమే ఉందని తేలింది. దీన్నిబట్టి జపాన్‌లో లాగా అన్ని దేశాలు అవినీతిని ఎంత బాగా తగ్గించుకోవచ్చో కూడా తేటతెల్లమవుతుంది. మనదేశం ఆ దిశలో గట్టిగా కృషిచేయాల్సి ఉంది. ప్రజాసేవల్లో లంచగొండితనం భారత్‌ను అత్యంత తీవ్రంగా పీడిస్తోందని, సంక్లిష్టంగా.. నెమ్మదిగా సాగే అధికారిక ప్రక్రియ, ప్రజలకు సేవలందించడంలో అనవసరంగా సాగదీయడం, అస్పష్టమైన నిబంధనలు ఇవన్నీ లంచాలకు మార్గం వేస్తున్నాయని సర్వే మొట్టికాయ వేసింది. భారత్‌తో పాటు మలేసియా, థాయ్‌లాండ్, శ్రీలంక, ఇండోనేషియా తదితర దేశాల్లోనూ అవినీతి మరింతగా వీరవిహారం చేస్తోందని, కొన్నిచోట్ల లంచాలతో పాటు, లైంగిక చర్యలకు ఒత్తిడి చేయడం కూడా జరుగుతోందని సర్వే ఉటంకించింది. అంతేకాదు, ఈ అవినీతిని ఎలా నిరోధించవచ్చో కూడా ఆ సంస్థ సూచించడం విశేషం. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సేవలకు సంబంధించిన పాలనాపరమైన ప్రక్రియను క్రమద్ధీకరించాలని, అవినీతి బంధుప్రీతి, ఆశ్రిత పక్షపాతం వంటి వాటిని నిరోధించేందుకు కట్టుదిట్టమైన నిబంధనలు రూపొందించాలని సూచించింది. అయితే, మనదేశంలో ఎప్పటి నుంచో అలాంటి చర్యలు అమలులో ఉన్నప్పటికీ, అవి ఇంకా కఠినతరం కావాలన్నదే ఇప్పుడు చెప్పదగిన సూచన. అవినీతిని అంతం చేసేందుకు మన ప్రభుత్వాలు కృతనిశ్చయంతోనే ఉన్నా లంచావతరాలపై ప్రభుత్వాలు, అధికారులు ఎంత కఠినంగా వ్యవహరిస్తున్నా లంచగొండి తనం మాత్రం పూర్తిస్థాయిలో సమసిపోకపోవడానికి కారణాలను ఇకనైనా ప్రభుత్వాలు విశ్లేషించుకోవాలి. అవినీతిని అన్నివిధాలా నిరోధించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు నాయకులు, మేధావులు, ప్రజలు అందరూ సమిష్టిగా చర్చించి ఖచ్చితమైన ప్రణాళికలకు పదునుపెట్టాలి. మొక్కై వంగనిది మానై వంగునా అన్నట్లు..అవినీతి మరింతగా పెరగకుండా కూకటివేళ్ళతో సహా ఇప్పుడే పెకలించివేయాలి. అందుకు అవినీతిపై ఉక్కుపాదం మోపాలి. అవసరమైతే చట్టాలను కూడా ఇంకా కఠినతరం చేయాలి. అడుగడుగునా పేరుకుపోయిన అవినీతిని పూర్తిస్థాయిలో తుడిచి పారేయాలి. అందుకు ప్రభుత్వాలకు, అధికారులకు ప్రజలు తమవంతు బాధ్యతగా సహకరించాలి. దేశానికి అవినీతిమరకలు అంటకుండా చూడాలి.

ఎవరికి వారు ధర్మబద్ధంగా, నీతివంతమైన జీవితాలు సాగిస్తూ.. సత్యం ధర్మం పాటించడంలో.. నీతి నిజాయితీల్లో మన దేశం ప్రపంచంలోనే అందరికీ మార్గదర్శకం కావాలి. ప్రపంచదేశాల్లో మనదేశానికి ఉన్న విశిష్టతను, ప్రతిష్టను చిరస్థాయిగా నిలుపుకుంటూ సకల మానవాళికీ గర్వకారణమైన రీతిలో భారత్ నిలవాలి. అందుకు ప్రభుత్వాలతో పాటు ప్రజలంతా కూడా ముందుగా అవినీతి జాఢ్యాన్ని రూపుమాపేందుకు ప్రతినబూనాలి. అవినీతి రహిత భారతావనిని సాకారం చేసుకోవాలి.

## మనం ఏ కాలంలో వున్నాం...?

ఇటీవల కురిసిన కొద్దిపాటి వర్షాలకే జాతీయ రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు సైతం రాకపోకలు తెగిపోయిన తీరు చూస్తుంటే... మనం ఏ కాలంలో ఉన్నాం...? అనే అనుమానం కలుగుతోంది. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆవిష్కరించుకుంటున్న మనం, నాలుగు చినుకులు పడితే ఒక ఊరి నుండి మరో ప్రాంతానికి వెళ్లలేని దుస్థితిలోకి వెళ్తున్నామంటే ఆశ్చర్యమేస్తోంది.

పాతరోజుల్లో ఇంతకంటే భారీ వానలు పడేవి, తుఫానులతో పాటు వరదలు కూడా ఎక్కువగానే వచ్చేవి, అప్పటితో పోలిస్తే ఇప్పుడు ఆ తీవ్రత బాగా తగ్గింది. గాలివానల సంఖ్య కూడా గణనీయంగా తగ్గింది. గతంలో ప్రతి ఏడాది ఒక గాలివాన వచ్చేది. ఇప్పుడు రెండు మూడేళ్లకోసారి మాత్రమే ఈ గాలివానలు, వరదల ప్రభావం ఉంటోంది. అప్పట్లో గాలి వాన వొస్తే భారీ సంఖ్యలో చెట్లు కూలి ట్రాఫిక్‌కి అంతరాయం కలిగేది, రోడ్ల విస్తరణ పేరుతో చెట్లన్నీ కొట్టిపారేశారు కాబట్టి ఇప్పుడా ఇబ్బంది కూడా లేదు. మూడు దశాబ్దాల కాలంలో సాంకేతిక పరంగా భారతదేశం ప్రపంచ దేశాలతో పోటీపడుతూ అభివృద్ధి పథంలో దూసుకుపోయింది. అంతేకాకుండా మౌలిక సదుపాయాల కల్పనలో కూడా మంచి పురోగతి సాధించింది. ముఖ్యంగా జాతీయ రహదారులతో పాటు గ్రామీణ రోడ్లపైన కూడా ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. అయినప్పటికి ఇంకా ఇలా రహదారులు, గ్రామీణ రోడ్లు తెగిపోవడాన్ని నివారించలేక పోవడం బాధాకరం. 2015లో పూర్తిగా కొట్టుకుపోయి రాకపోకలు స్తంభించిన అనుభవాలని దృష్టిలో పెట్టుకుని కూడా జాతీయ రహదారి-45లో నెల్లూరు-గూడూరుల మధ్య ఇప్పటికీ పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేపట్టకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. తేలికపాటి వర్షాలతో వచ్చిన చిన్న వరదకు ఈ రోడ్డులో ఇప్పుడు మళ్ళీ రాకపోకలు స్తంభించే పరిస్థితి ఏర్పడింది. ఎప్పటికప్పుడు తూ తూ మంత్రంగా తాత్కాలిక మరమత్తులు చేసి సరిపెడుతున్నారు తప్ప, శాశ్వత పరిష్కారానికి పాలకులు, అధికారులు చొరవ చూపడంలేదు. ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకునైనా శాశ్వత పరిష్కార మార్గాలను అన్వేషిస్తారని ఆశిద్దాం!

*పుట్టా హరిత,* గూడూరు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

**www.lawyerpatrika.com**

## ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం సంగీత పాఠశాల భవనానికి స్థలం కేటాయించండి!




ఆంధ్రప్రదేశ్ ప్రభత్వము నెల్లూరు ప్రభుత్వ సంగీత పాఠశాలకు శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం పేరు పెట్టాలని నిర్ణయించడం హర్షణీయం. ప్రభుత్వ సంగీత పాఠశాల నెలకు దాదాపు లక్ష రూపాయల అద్దె చెల్లిస్తూ గత 29 సంవత్సరములుగా అద్దె భవనంలో నడుపబడుచున్నది. స్వంత భవన నిర్మాణానికి స్థలము, భవన నిర్మాణం కోసం నిధులు కేటాయింపు చేయించమని గత ప్రభుత్వ హయాంలో పెద్దలతో పాటు ప్రస్తుత ప్రభుత్వ డిప్యూటి స్పీకర్ కోన రఘుపతి, మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్ గార్లకు, జిల్లా కలెక్టరు గారికి కూడా విన్నవించుకున్నాము. నెల్లూరు మునిసిపల్ మార్కెట్ సమీపములో వాడుకలో లేని ఖాళీగా ఉన్న జూబిలీ ఆసుపత్రి భవనము స్థలము ఈ పాఠశాల కోసం కేటాయించమని దరఖాస్తు చేయడం జరిగింది. కానీ పని జరగలేదు. సంగీత పాఠశాలకు బాల సుబ్రహ్మణ్యం గారి పేరు పెట్టారు కాబట్టి స్వంత భవన నిర్మాణానికి స్థలము కేటాయింపు విషయంలో కూడా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని, ఆ భవన సముదాయంలో బాలసుబ్రహ్మణ్యం గారి విగ్రహం ప్రతిష్ఠాపన చేసినట్లైతే వారి జయంతి, వర్ధంతుల సందర్భంగా వారి స్మృత్యర్థం కార్యక్రమాలు నిర్వహించే అవకాశం ఉంటుందని మనవి. పాలకులు అధికారులు మనసు పెట్టాలి.

*రాళ్ళపల్లి సుబ్బులక్ష్మి,*
**కృష్ణ లీలా తరంగ ప్రచార సమితి,**
**నెల్లూరు.**

**లాయర్**

**పాఠకులకు మనవి**
**మా(మీ) లాయర్ పత్రికకు**
**సమాచారం / లేఖలు**
**పంపదలచిన వారు**
**9866314741 నంబరుకు**
**వాట్సయాప్ ద్వారా గాని, లేదా**
**lawyerpatrika@gmail.comకి**
**ఈ-మెయిల్ ద్వారా గాని**
**పంపవలసిందిగా విజ్ఞప్తి.**
**పోస్టల్ చిరునామా :**
**ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,**
**మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.**
**- సం/-**

## అరుదైన ఆణిముత్యం మన ప్రధాని మోడీ

గుజరాత్, తెలంగాణ, మహారాష్ట్రలలో ఒకేరోజు భారత ప్రధాని నరేంద్ర మోడీ చేసిన మెరుపు పర్యటన భారతదేశ ప్రజల ఆరోగ్యం పట్ల ఆయనకున్న అంకిత భావాన్నీ, చిత్తశుద్ధిని ప్రస్ఫుటం చేస్తుంది. ప్రపంచాన్ని వణికిస్తున్న కరోనా మహమ్మారికి టీకా తయారు చేస్తున్న 3 భారతీయ ఔషధ తయారీ సంస్థలను సందర్శించి వాక్సిన్ ఏ దశలో వుందో, వైద్య శాస్త్ర నిపుణులు చేస్తున్న ప్రయోగాలు ఎంతవరకు సత్ఫలితాలు ఇస్తున్నాయో భారత ప్రధానే స్వయంగా తెలుసుకోవడం గొప్ప విషయం. ఇలాంటి చురుకైన ప్రధానిని, బాధ్యతాయుతమైన నాయకుడిని కలిగి ఉండడం భారతదేశం చేసుకున్న అదృష్టం. దేశ సరిహద్దుల్లో క్లిష్ట పరిస్థితులు ఏర్పడ్డప్పుడు గాని, దీపావళి వంటి జాతీయ పండుగలు వచ్చినప్పుడు గాని నేరుగా మన సైన్యం వద్దకు వెళ్లి వాళ్ళల్లో మనో ధైర్యాన్ని, మానసిక స్థైర్యాన్ని నింపడం ఒక్క మోడీకే సాధ్యం. కరోనా కష్టకాలంలో ఏర్పడ్డ క్లిష్ట పరిస్థితులను సమర్ధనీయంగా ఎదుర్కొని ఆరోగ్యభారత్‌గా దేశాన్ని ముందుకు నడిపించిన ఘనత ఆయనది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటినుండి పరిపాలించిన వ్యక్తులలో అరుదైన వ్యక్తిగా ఈ తరం గుండెల్లో నిలిచిపోయే నవతరం ప్రధాని నరేంద్ర మోడీ. ఈ దేశానికి లభించిన అరుదైన ఆణిముత్యం ఆయన.

*యం. చంద్రమౌళి,* కొత్త ఢిల్లీ.

# వణికించిన..'నివర్'

## ➢ 225 కోట్లకు పైగానే నష్టం

**'నివర్' తుఫాన్ దెబ్బకు జిల్లా అల్లకల్లోలమైంది. ఈదురుగాలులు, భారీవర్షాలతో జిల్లా అతలాకుతలమైంది. గత పాతికేళ్ళలో ఎప్పుడూ లేనంతగా భారీస్థాయిలో వరదనీటి ఉధృతితో పెన్నమ్మ పొంగిపొర్లింది. సోమశిల జలాశయం నుంచి ఈనెల 27, 28 తేదీల్లో 6.63 లక్షల క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదిలేయడంతో ఆ ప్రవాహమంతా సముద్రం వైపుకు మళ్ళింది. ఈ తుఫాన్ దెబ్బకు జిల్లాకు కనీసం 225 కోట్ల రూపాయలకు పైగానే నష్టం జరిగినట్లు జిల్లా ఉన్నతాధికారులు అంచనా వేశారు.**



- **భారీ వానలతో వేలాది ఎకరాల్లో నీటమునిగిన పంటలు**
- **రోడ్లు ధ్వంసం.. చెరువులకు గండ్లు.. ఇళ్ళల్లోకి నీళ్ళు**

అటొచ్చి ఇటు వెళ్ళిపోతుందని అనుకున్న 'నివర్' తుఫాన్ పోతూ పోతూ జిల్లాను ఒక పట్టు పట్టింది. భారీ వానలతో జిల్లాను గజగజ వణికించింది. ప్రజలకు కష్టాలను, రైతన్నలకు నష్టాలను కలిగించింది. జిల్లాకు కంటనీరు మిగిలించింది. వేలాది ఎకరాల్లో తొలిదశలో ఉన్న వరి, తదితర పంటలన్నీ నీటమునిగాయి. వందలాది కిలోమీటర్ల రహదారులు, గ్రామాల్లోని రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. సుమారు 290 కిలోమీటర్ల మేర రహదారులు ధ్వంసమయ్యాయి. 33వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిని దాదాపు 78 కోట్ల దాకా నష్టం జరగడంతో రైతులు విలవిల్లాడిపోయారు. ఇళ్లలోకి నీళ్ళు రావడంతో పెన్నా నది పరీవాహక ప్రాంతాల ప్రజలు, లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గ్రామీణులు పిల్లాపాపల్ని ఒడిసిపట్టుకుని సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీశారు. తుఫాన్ ప్రభావంతో వారం రోజుల పాటు జనజీవనం స్తంభించి పోయింది.



సోమశిల జలాశయంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

### పెన్నానదికి భారీగా వరద ప్రవాహం..



నెల్లూరు పొర్లుకట్ట ప్రాంతవాసుల ఇక్కట్లు

భారీగా కురిసిన వర్షాలతో గత శుక్ర, శనివారం రెండు రోజుల్లో ప్రజలు పడిన కష్టాలు అన్నీఇన్నీ కావు. ఈ నెల 28వ తేదిన సోమశిల జలాశయంలో 72 టిఎంసిలకు పైగానే నీటి నిల్వ ఉండగా, ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద ప్రవాహం రావడంతో ఆ నీటినంతా దిగువకు వదిలేశారు. సోమశిల చరిత్రలోనే ఎన్నడూ లేనంతగా 6.63లక్షల క్యూసెక్కుల వరదనీటి ప్రవాహం వచ్చింది. ఆ ప్రవాహాన్నంతా వచ్చింది వచ్చినట్లుగా దిగువకు వదిలేయడంతో పెన్నానది పరీవాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. పెన్నానదికి వరద పోటెత్తింది. నదీపరీవాహక ప్రాంతాల్లో ఉన్న 12 మండలాల్లోని అనేక గ్రామాల ప్రజలు ఈ వరద ఉధృతికి భయపడిపోయారు. పెన్నానదితో పాటు జిల్లాలోని నదులు, చెరువులు, వాగులు వంకలన్నీ పొంగి పొర్లాయి. ఎడతెరపి లేకుండా కురిసిన వానల వల్ల అనేకచోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. రోడ్లు ధ్వంసమయ్యాయి. నెల్లూరు నగరంలో కూడా అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్ళలోకి నీళ్ళు ప్రవాహంలా రావడంతో ఇళ్ళు దెబ్బతిని ఆయా ప్రాంతాల్లో ప్రజలు పడిన అవస్తలు వర్ణనాతీతం. నెల్లూరులోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రంగనాయకులస్వామి దేవాలయంలోకి పెన్నానీరు పొంగి వచ్చింది. చెంతనే ఉన్న నెల్లూరు బ్యారేజీ వద్ద పెన్నానది భారీ వరదతో మహో గ్రంగా ప్రవహించింది. అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రత్యేక బృందాలు ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటుండడంతో ఈ తుఫాన్ దెబ్బకు జిల్లాలో ప్రాణనష్టాలు సంభవించలేదు కానీ, భారీ వానల దెబ్బకు ఆస్తినష్టం మాత్రం భారీగానే జరిగింది.

### వేలాది ఎకరాల్లో పంట నష్టం..

జిల్లాలో నివర్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో జిల్లా బాగా నష్టపోయింది. 34,200 హెక్టార్లలో వరి, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, 94 చెరువులకు గండ్లుపడి వేలాది ఎకరాల్లోని పంటపొలాలు నీటమునిగాయని, 290 కిలోమీటర్ల రోడ్లు దెబ్బతినడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మగ్గాల్లోకి నీళ్ళు చేరి నేతకారుల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లావ్యాప్తంగా 2,729 విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, 200 ట్రాన్స్ ఫార్మర్లు పూర్తిగా దెబ్బతిని విద్యుత్‌శాఖకు మొత్తంగా 3.20 కోట్ల దాకా నష్టం వాటిల్లిందంటూ తుఫాన్ నష్టాల వివరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డికి నీటివనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు, ఎస్పీ భాస్కర్ భూషణ్‌లు గత నెల 28న రేణిగుంటలో జరిగిన సమీక్షా సమావేశంలో సిఎంకు వివరించారు. ఈ సందర్భంగా సిఎం జగన్ మాట్లాడుతూ బాధితులను తక్షణం ఆదుకోవాలన్నారు.



స్వర్ణముఖి బ్యారేజీ వద్ద వరద ప్రవాహం



### నెల్లూరు నగరానికి 85 కోట్ల దాకా నష్టం

నివర్ తుఫాన్ ప్రభావంతో నెల్లూరు నగరానికి కనీసం 85 కోట్ల దాకా నష్టం వాటిల్లివుంటుందని అధికారుల ప్రాధమిక అంచనా. నెల్లూరులో ఎంతోకాలంగా డ్రైనేజీ వ్యవస్థ బాగుపడకపోవడంతో ఈ భారీ వర్షాలకు డ్రైనేజీ కాలువలు, రోడ్లు మరింతగా దెబ్బతిన్నాయి. అనేకచోట్ల మురుగునీటి కాలువలు, కల్వర్టులు తెగిపోయి మురుగునీరంతా రోడ్లపైకి ప్రవహించింది. వరద ముంపు ప్రభావంతో నెల్లూరులోని పెన్నానదీ పరీవాహక ప్రాంతాలు జలదిగ్బంధంలో చిక్కుకుపోయాయి. పొర్లుకట్ట, భగత్‌సింగ్‌నగర్, మన్సూర్‌నగర్, చంద్రబాబునగర్, ఆర్టీసి కాలనీ తదితర అనేక ప్రాంతాలు జలమయంగా మారిపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులుపడ్డారు. నీటిపారుదల మంత్రి డా.అనిల్, వైకాపా నాయకులు, అధికారులు అందరూ కలసి బాధితులను ఆదుకుంటూ నగర ప్రజలకు సహాయ చర్యలు చేపట్టారు.

# భయం వద్దు.. నేనొస్తున్నా!..

- **వరదలోనే పడవ నడుపుకుంటూ వచ్చేసిన మంత్రి గౌతంరెడ్డి**
- **మంత్రి సాహసానికి విస్తుపోయిన వీర్లగుడిపాడు జనం**



*భారీ వానలు.. వరదలొచ్చినప్పుడు సాధారణంగా అనేక మంది నాయకులు కార్లల్లో తిరుగుతూనో, లేదా తమ ఇళ్ళల్లో కదలకుండా కూర్చుని అందరూ జాగ్రత్తగా ఉండాలంటూ ప్రకటనలు చేస్తూనో ఉండడం అందరికీ తెలిసిందే. కానీ వైకాపా నాయకులు అలా కాదు..విపత్కర పరిస్థితుల్లో ఎంతకైనా తెగించి ప్రజలను ఆదుకుంటారని నిరూపిస్తూ సాక్షాత్తూ మంత్రి గౌతంరెడ్డే తెడ్డు వేసుకుని పడవ నడుపుకుంటూ వరద ప్రవాహంలోనే వెళ్ళి ప్రజలను కలుసుకోవడం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది.*

తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తమ నియోజకవర్గ ప్రజలకోసం తానే స్వయంగా తెడ్డు వేసుకుని పడవ నడుపుకుంటూ వెళ్ళడంతో అక్కడి ప్రజలు ఎంతగానో విస్తుపోయారు. 'భయం వద్దు..నేనొస్తున్నా!..అంటూ వరదనీటిలోనే పడవ నడుపుకుంటూ వచ్చేసిన మంత్రి గౌతంరెడ్డి సాహసానికి జేజేలు పలికారు. నివర్ తుఫాన్ సందర్భంగా గత నెల 28వ తేదిన ఆత్మకూరు నియోజకవర్గంలోని సంగం మండలం వీర్లగుడిపాడు గ్రామం వద్ద ఈ సంఘటన జరిగింది. చిన్న వానకే జలమయమైపోయే చిన్న గ్రామం అది. ఈ భారీ వానల్లో అక్కడి ప్రజలు ఎన్ని కష్టాలు పడుతున్నారో..వారిని ఆదుకుందామని మంత్రి మేకపాటి నేరుగా పడవ మీద ఇక్కడికి వచ్చేశారు. తమను కలుసుకునేందుకు మంత్రి పడవలో వస్తున్నారని తెలిసి ఊరు ఊరంతా వచ్చి అక్కడున్న గట్ల మీద నిల్చొని ఆయన రాకకోసం ఎంతో ఆతృతగా చాలా సేపు ఎదురుచూసి ఆయనపై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. అప్పటికే నిండా మునిగిపోయిన ఆ గ్రామాన్ని చూసి మంత్రి గౌతంరెడ్డి చలించిపోయారు. 'వర్షాలు వచ్చినప్పుడన్నా మీరంతా సురక్షిత ప్రాంతాలకు రావాలి కదా.. ఇక్కడే ఉంటే ప్రమాదం కదా!'..అని ఆయన ఆత్మీయంగా అక్కడి ప్రజలతో అన్నారు. 'ఎంతోకాలంగా ఇలాంటి వానలు, వరదలు మాకు సాధారణమైపోయాయి సార్!'..అంటూ అక్కడి ప్రజలు దీనంగా జవాబు చెప్పారు. అందుకు స్పందించిన మంత్రి ఇకపై ఎంత భారీ వరదలొచ్చినా ఈ గ్రామానికి ఎలాంటి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటానని వారికి చెప్పారు. ప్రజలకు తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. గ్రామస్తుల రాకపోకలకు అనువుగా వంతెన నిర్మాణం చేయిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఇక్కడున్న ప్రజలందరికీ తక్షణం భోజన సదుపాయాలు, మంచినీటి వసతి కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత ఊరే ఏరులా ఉన్న వీర్లగుడిపాడులోని అన్ని వీధుల్లోనూ పడవలోనే కలియతిరుగుతూ బాధితులను కలుసుకుని మాట్లాడారు. ఇక్కడున్నవారిలో అనేకమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినా, ఇంకా గ్రామంలో సుమారు వందమందికి పైగానే ప్రజలుండ డంతో మంత్రి నేరుగా పడవలోనే వారి వద్దకు వెళ్ళి వారిని పలకరించడం విశేషం. దీంతో ఊరి ప్రజలంతా మంత్రి గౌతంరెడ్డికి తమ మీద ఉన్న అభిమానానికి..ఆయన తమకోసం చేసిన సాహసానికి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. తొలుత పెన్నానది ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి 1995 తర్వాత పెన్నాకు వచ్చిన పెద్ద ప్రవాహం ఇదేనన్నారు. భారీవర్షాలకు దెబ్బతిన్న ఇళ్ళకు వెంటనే మరమ్మతులు చేయించుకునేందుకు, పంటలు నష్టపోయిన రైతులు తిరిగి కోలుకునేందుకు అధికారులు తక్షణం తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

### జేసీబీ ఎక్కి ముంపు ప్రాంతాల్లో పర్యటన :

ఆ తర్వాత అనంతసాగరం మండలంలోని పెన్నాతీర గ్రామాలైన కచిదేవరాయపల్లి, వెంగంనాయుడుపల్లి తదితర గ్రామాలన్నీ మంత్రి మేకపాటి ఏకంగా జేసిబి ఎక్కేసి దాని కమ్ములు పట్టుకుని పర్యటిస్తూ వరదబాధితులను కలుసుకుని ధైర్యం చెప్తుండడం ఆయా గ్రామాల్లోని ప్రజలను మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. ఆ స్థితిలో మంత్రిని చూసిన ప్రజలంతా ఈ విపత్కర పరిస్థితుల్లో తమవద్దకు వచ్చి పలకరిస్తున్న మంత్రిని మనసారా స్వాగతిస్తూ.. తమ సంతోషాన్ని వెల్లడించారు.

# నెల్లూరు కబుర్లు

### శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి సేవలో..

## కలెక్టర్ దంపతులు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నెల్లూరు దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయాన్ని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు దంపతులు దర్శించుకుని పూజలు చేశారు. అమ్మవారితో పాటు ఆలయ ప్రాంగణంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామివారిని కూడా దర్శించుకున్నారు. ఆలయ ఇ.ఓ శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి సభ్యులు కలెక్టర్ దంపతులను సాదరంగా ఆహ్వానించారు.

## ఇన్‌చార్జి జేసీగా నాగలక్ష్మి

జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారిగా, ఇన్‌చార్జి జేసీ (ఆసరా)గా డిఆర్‌డిఏ ఇన్‌చార్జి పి.డి జివిఎస్‌ఎస్ నాగలక్ష్మిని నియమిస్తూ జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు తాజాగా గతనెల 30న ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటిదాకా డిఆర్‌ఓగా ఉన్న ఎంవి రమణ ఉద్యోగ విరమణ చేయడంతో కలెక్టర్ ఈ నిర్ణయం తీసుకున్నారు.

## ఎయిమ్స్‌కి విశ్వసాయి విద్యార్థి



రాష్ట్రస్థాయి ఇంటర్ మరియు జాతీయ స్థాయి నీట్ పోటీ పరీక్షల శిక్షణకు నమ్మకమైన విద్యాసంస్థగా పేరుపొందిన విశ్వసాయి ఇప్పుడు మరో ఘనత సాధించింది.

ఇంటర్మీడియట్ పూర్తైన వెంటనే నేరుగా ఎయిమ్స్‌లో సీటు సాధించాడు విశ్వసాయి విద్యార్థి వి.వి.సాయిచరణ్. ఇటీవల ప్రకటించిన ఎంబిబిఎస్ ఆలిండియా కోటా కౌన్సిలింగ్ విభాగంలో ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)లో సాయిచరణ్ మెడికల్ సీటు సాధించాడు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డా. ఎన్.సత్యనారాయణ, వైస్‌ఛైర్మన్ జి.కృష్ణమోహన్‌లు మెడికల్ విద్యలో ప్రతిష్ఠాత్మకమైన సీటు సాధించిన సాయిచరణ్‌ను అభినందించారు. ఈ స్ఫూర్తితో భవిష్యత్‌లో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కృషి చేస్తామని, పైచదువులలోనూ సాయిచరణ్ ఉన్నతంగా రాణించాలని వారు ఆకాంక్షించారు. ఛైర్‌పర్సన్ రుక్మిణి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సుభాన్ నగర్ గిరిజనులకు అన్నప్రసాదం



భగవాన్ శ్రీ సత్యసాయిబాబా దివ్యానుగ్రహంతో ఇమ్మడిశెట్టి సూర్యప్రసాద్ (యుఎస్ఏ) సహకారంతో, వారి తండ్రి గారైన ఇమ్మడిశెట్టి వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థం ఇటీవల నెల్లూరులోని సుభాన్‌నగర్ గిరిజనులైన సుమారు 5వందల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. నివర్ తుఫాన్ ప్రభావంతో పెన్నానది వరదలతో ఇబ్బందిపడుతున్న బాధితులకు సహయంగా గాదంశెట్టి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

## దెబ్బతిన్న ఇళ్ళకు పాతికవేలు ఇవ్వాలి

నివర్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వానలు, వచ్చిన వరదల వల్ల నెల్లూరు నగరంలోని ముంపు ప్రాంతాల్లో పూర్తిగా దెబ్బతిన్న ఇళ్ళకు పాతిక వేల రూపాయలు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ళకు పదివేల రూపాయల వంతున పరిహారం ఇవ్వాలని టిడిపి నగర ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి డిమాండ్ చేశారు. గతనెల 29న నెల్లూరులోని 48, 49, 50, 53, 54 డివిజన్‌లలో ఆయన వరద బాధితులను పరామర్శించారు. అనంతరం వెంకటేశ్వరపురం పాలిటెక్నిక్ కళాశాలలోని పునరావాస కేంద్రంలో బాధితులకు అన్నం పాకెట్లు పంపిణీ చేశారు. జహీర్, సుధీర్, సుబ్బారావు, రమాదేవి, చంద్ర, గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నెల్లూరు రైల్వే డిఎస్‌పిగా

## మురళీకృష్ణ

గుంటూరు రేంజ్‌లో విఆర్‌లో ఉన్న టి.మురళీకృష్ణకు పదోన్నతి కల్పించి నెల్లూరు రైల్వే డిఎస్పీగా నియమించారు. ఇక్కడున్న డిఎస్పీ వసంతకుమార్ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో మురళీకృష్ణ నియమితులయ్యారు. పదోన్నతిపై ఈనెల 28న ఇక్కడకు వచ్చిన మురళీకృష్ణకు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.శ్రీనివాసాచారి, ఎస్‌ఐలు సిరాజుద్దీన్, వెంకయ్య, మాలకొండయ్య, ఆర్‌పిఎఫ్ సిబ్బంది పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు.

### విఎస్‌యులో

## కొత్త కోర్సులు

నెల్లూరులోని విక్రమసింహపురి యూనివర్శిటీలో కొన్ని కొత్త కోర్సులు కూడా ప్రవేశపెడుతున్నట్లు విఎస్‌యు రిజిస్ట్రార్ ఎల్.విజయకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టుతో ఇంటర్ విద్యార్థులకు కోర్సులు ప్రారంభిస్తున్నామని, డిప్లొమా ఇన్ ఆక్వా ల్యాబ్ టెక్నీషియన్, ఆక్వా మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ సర్టిఫికెట్ కోర్సు, డిప్లొమా ఇన్ అనలెటికల్ కెమిస్ట్రీలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, డిగ్రీ పూర్తిచేసిన విద్యార్థులకు కూడా ఈ అవకాశం ఉందని తెలిపారు. డిసెంబర్ 14వ తేదీలోగా డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ విఎస్‌యుడిఓఏ డాట్ ఇన్ (www.vsudoa.in) వెబ్‌సైట్లో విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సచివాలయాల్లోనూ..

## ఆరోగ్యశ్రీ సేవలు

ప్రజలకు మరింత చేరువగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యశ్రీ వథకానికి స్వల్ప మార్పులు చేసింది. ఇప్పటిదాకా ఆరోగ్యశ్రీ రెఫరల్ పాయింట్లుగా మండలాల పరిధిలో పిహెచ్‌సిలు, సిహెచ్‌సిలు ఉండేవి. ఇప్పుడు తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయ స్థాయిలోనే ఆరోగ్యశ్రీ సేవలు అందేలా మార్పులు చేయడమే కాక సచివాలయ స్థాయిలోని ఏఎన్‌ఎంలకు శిక్షణ కూడా ఇచ్చిందని ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. గత నెల 28న ఆయన నెల్లూరు కార్యాలయంలో ఆరోగ్యశ్రీ పోస్టర్లను ఆవిష్కరించారు.

### రైతులకు

## నష్టపరిహారం చెల్లించాలి

**డిసిసి నేత చేవూరు డిమాండ్**



జిల్లాలో నివర్ తుఫాన్ కారణంగా జరిగిన నష్టాన్ని గుర్తించి ప్రభుత్వం వెంటనే రైతులకు నష్టపరిహారం చెల్లించాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

జిల్లాలో దాదాపు 40వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన దంతో రైతులు పడే బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. భారీ వర్షాలతో బాధలుపడుతున్న వారికి కాంగ్రెస్ శ్రేణులు ఎప్పటికప్పుడు తగు సహాయ చర్యలు చేపట్టేలా తాము కృషిచేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే బాధితులకు పూర్తిస్థాయిలో సాయం అందించాలని, ముంపు ప్రాంతాల ప్రజలను సత్వరం ఆదుకోవాలని కోరారు. పెన్నానది లోతట్టు ప్రాంతాల ప్రజలను ఆదుకోవాలని, అధికారులు ఈ దుష్టితిలో పేద ప్రజలకు అన్నివిధాలా సాయం అందించాలన్నారు. జిల్లాలో రోడ్లు, చెరువులు బాగా దెబ్బతిన్నాయని, ఈ నష్టాన్ని ప్రభుత్వమే పూడ్చాలని ఆయన కోరారు.

## పాలు, బిస్కెట్లు పంపిణీ

నెల్లూరు నగరంలోని వరద ముంపు ప్రాంతాల్లో బిజెపి, భజరంగదళ్ నాయకులు, కార్యకర్తలు తుఫాన్ బాధితులకు తమవంతు సేవలందించాయి. మనుమసిద్ధి నగర్, ఉయ్యాల కాలువ, పొర్లుకట్ట తదితర ప్రాంతాల్లో సుమారు 8 వందల కుటుంబాలకు ఈనెల 29న పాల ప్యాకెట్లు, బిస్కెట్లు, మినరల్ వాటర్ క్యాన్లు, కొవ్వొత్తులు, దోమలకడ్డీలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యశ్వంత్‌సింగ్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ భయ్యా వాసు తదితరులు పాల్గొన్నారు.

### రెడ్‌క్రాస్ నుంచి

## అంకయ్యచౌదరి తొలగింపు

రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ పాలక మండలి సభ్యుడు మక్కెన అంకయ్య చౌదరిని తొలగిస్తూ రెడ్‌క్రాస్ రాష్ట్ర శాఖ కార్యదర్శి అశ్విన్‌కుమార్ ఫరీదా గత నెల 28న ఉత్తర్వులు జారీచేశారు. రెడ్‌క్రాస్ ప్రాథమిక సభ్యత్వం నుంచి కూడా ఆయన్ను తొలగించారు. సంస్థాగత విషయాలను రచ్చకీడ్చడం వల్ల అంకయ్య చౌదరిని తొలగిస్తూ రాష్ట్రశాఖ ఈ చర్యలు తీసుకుందని నెల్లూరు రెడ్‌క్రాస్ ప్రతినిధులు పేర్కొన్నారు.

## పూలే ఆశయాలు స్ఫూర్తిదాయకం



బడుగు బలహీన వర్గాల ప్రజలకు తమవంతు సేవలందించడంతో పాటు దేశంలో బాలికల విద్యకు బాటలు వేసిన మహాత్మా జ్యోతిరావు పూలే దంపతుల ఆశయాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కొనియాడారు. ఈనెల 28న జ్యోతిరావు పూలే వర్ధంతిని పురస్కరించుకుని నెల్లూరులోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ సూర్యప్రకాష్ రావు, కార్పొరేషన్ కమిషనర్ దినేష్‌కుమార్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, జిల్లా బిసి సంక్షేమాధికారి వెంకటయ్య, బిసి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కృష్ణారావు తదితర అధికారులు పాల్గొన్నారు.

## మీ సేవలు అపూర్వం

**రిటైరైన ఎస్‌ఐలను అభినందించిన జిల్లా ఎస్పీ**



దాదాపు మూడు దశాబ్దాలపాటు వృత్తిలో అంకితభావంతో పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పలువురు పోలీసు సిబ్బందిని గతనెల 30న జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ సత్కరించారు. 'మీ సేవలు అపూర్వమని, శేషజీవితాన్ని మీరు ఆనందంగా గడపాలని' ఎస్పీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు. డిసిఆర్‌బి ఎస్‌ఐ ఆర్‌ఏ లింకన్, కావలి టూటౌన్ ఎస్‌ఐ ఎస్.వెంకటేశ్వర్లురాజు, ఓజిలి ఎస్‌ఐ బి.నాగేంద్రబాబు, ఏఆర్ ఎస్‌ఐ కె.రమణయ్య ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వారిని జిల్లా ఎస్పీ భాస్కర్‌భూషణ్ దుశ్శాలువలతో సత్కరించారు. ఉద్యోగవిరమణ పొందిన సిబ్బంది అందరూ తమ కుటుంబసభ్యులతో సమానమేనని, భవిష్యత్తులో వారికి ఎలాంటి అవసరమున్నా తమను నేరుగా కలవొచ్చని చెప్పారు. ఉద్యోగం నుంచి విరమణ పొందిన రోజే వారందరికీ బెనిఫిట్స్ అందేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఏఆర్ ఏఎస్పీ ఎస్.వీరభద్రుడు, ఏఆర్ డిఎస్పీ గాంధీ, ఏపి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాద్‌రావు, పిఆర్‌ఓ శ్రీకాంత్ పాల్గొన్నారు.

## చట్టాలను సరిగా అవగాహన చేసుకోవాలి

**- డాక్టర్ ఎన్. కన్నన్**



ప్రభుత్వాలు ప్రజలకు న్యాయం అందించేందుకు ఎన్నో రకాలైన చట్టాలు అమలుచేస్తున్నాయని, వాటిని సక్రమంగా అవగాహన చేసుకుని న్యాయం పొందాలని స్థానిక నారాయణ దంతకళాశాల హెచ్‌ఓడి డాక్టర్ ఎన్.కన్నన్ అన్నారు. గతనెల 30న నెల్లూరులోని గాంధీపార్కులో కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైనదన్నారు. చిన్నారులు, మహిళలు, దళితులకు న్యాయం అందించడం కోసం ప్రభుత్వాలు ప్రత్యేక చట్టాలు చేయడం జరిగిందని, ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల ఆ చట్టాలను సరిగా వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉచిత న్యాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. న్యాయవాదిగా ప్రజలకు నిత్యం అండగా ఉండే రమాదేవిని ఈ సందర్భంగా సన్మానించారు. గౌతమబుద్ధ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జయప్రకాష్, కేతా సుబ్బారావు, రాయప్ప, సామ్నా జిల్లా ప్రధాన కార్యదర్శి హనోక్, కళాకారుడు మురళీమోహన్, చింతా ప్రసాద్ పాల్గొన్నారు.

Please note the change

www.lawyerteluguweekly.com

is now

www.lawyerpatrika.com

# కామాక్షితాయి అమ్మవారికి కానుకలు

## దాతలచే 17 లక్షలకు పైగా విలువజేసే బంగారు నగల వితరణ



జొన్నవాడలోని శ్రీ కామాక్షితాయి అమ్మవారికి ఇద్దరు దాతలు ఇటీవల లక్షల రూపాయల విలువజేసే బంగారు ఆభరణాలను కానుకగా సమర్పించి అమ్మవారి పట్ల తమకున్న భక్తిని చాటుకున్నారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త శ్రీకొలను రాజారెడ్డి–శ్రీమతి పూజిత దంపతులు కామాక్షితాయి అమ్మవారికి 13 లక్షలా 17 వేల రూపాయల విలువైన 263 గ్రాముల 400 మిల్లీగ్రాముల బంగారు అడ్డిగను కానుకగా సమర్పించుకున్నారు. అదేవిధంగా అమెరికాలోని కాలిఫోర్నియాలో ఉన్న అమ్మవారి భక్తులు ఏటూరు గోపాల్‌రెడ్డి–శ్రీమతి సత్యవతి దంపతులు 4 లక్షలా 76 వేల రూపాయల విలువైన శివపార్వతులు కలిగిన బంగారుదండను అమ్మవారికి సమర్పించారు. ఆలయ నిర్వాహకులు ఈ బంగారు ఆభరణాలను స్వామి–అమ్మవార్లకు అలంకరించి ప్రత్యేకపూజలు చేశారు. శ్రీవార్ల కల్యాణోత్సవం జరిపించారు.

అనంతరం ఆలయ ఇ.ఓ వెంకటశ్రీనివాసులురెడ్డి తదితరుల సమక్షంలో దాతలకు శ్రీవార్ల శేషవస్త్రాలను బహూకరించారు. ఆలయ అర్చకులు దాతలకు వేదాశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధిలో భాగంగా దేవస్థానం ప్రాకార మండపం చుట్టూ సాలాహారం నిర్మించేందుకు, ఆలయ ప్రాకార మండపం మూడువైపులా స్టీలు గేట్లు, గోపుర మండపం వద్ద, అమ్మవారి రేవుకు వెళ్ళే దారిలో గ్రానైట్ రాళ్ళు ఏర్పాటు.. తదితర అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా దాత శ్రీ కొలను రాజారెడ్డి ముందుకు వచ్చారని ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తెలియజేశారు.

### జిల్లాలోని చిరు వ్యాపారులకు

# 'తోడుగా జగనన్న'



జిల్లాలో జగనన్న తోడు పథకం ద్వారా 60,867 మందికి 60.86 కోట్ల రూపాయలను చిరు వ్యాపారులకు అందజేశామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పారు. ఈ నెల 2వ తేదీ నెల్లూరు, కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో ఆయన జగనన్న తోడు, వైఎస్సార్ భీమా పథకాలపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. బ్యాంకర్లతో సమీక్షలు జరిపి లబ్దిదారులకు అందరి ఖాతాల్లో ఆ డబ్బులు జమ అయ్యాయో లేదో సమీక్షించాలని ఆదేశించారు. అర్హులైన లబ్దిదారుల జగనన్న తోడు దరఖాస్తులను బ్యాంకర్లు సాంకేతిక కారణాల వలన తిరస్కరించకూడదని స్పష్టం చేశారు. బ్యాంకుల రీజనల్ మేనేజర్లు, కంట్రోలర్లతో సమావేశం నిర్వహించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై బ్యాంకర్లతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ నాగలక్ష్మి, మెప్మా పి.డి., అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రైతులపై లాఠీచార్జి తగదు

సమస్యలు తీర్చాలంటూ ఢిల్లీలో నిరసన చేపట్టిన అన్నదాతలపై పోలీసులు లాఠీచార్జి చేయడం తగదని సిఐటియు నాయకులు పేర్కొన్నారు. నెల్లూరులో సిఐటియు ఆధ్వర్యంలో గతనెల 28న నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ ఆందోళనలో జిల్లా రైతుసంఘం నాయకుడు శ్రీరాములు మాట్లాడుతూ దేశంలో వ్యవసాయాన్ని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించి రైతులను వీధులపాలు చేసేందుకు కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందంటూ ఆరోపించారు. కేంద్రం వెంటనే రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కి తీసుకోవాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, కార్యదర్శి అజయ్‌కుమార్, వెంకమరాజు తదితరులు పాల్గొన్నారు. సిపిఎం నాయకుడు మాదాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కూడా ఇదేరోజున నెల్లూరునగరంలోని అయ్యప్పగుడి, డైకాస్‌రోడ్డు కూడళ్ళ వద్ద కేంద్రప్రభుత్వం తీరుకు నిరసనగా ఆందోళనలు చేపట్టారు.

### నష్టపోయిన ప్రతి రైతుకు

# పరిహారం

**- జేడీ అనందకుమారి**

నివర్ తుఫాన్ కారణంగా నష్టపోయిన ప్రతిరైతుకు పరిహారం అందిస్తామని వ్యవసాయ శాఖ జేడీ ఆనందకుమారి స్పష్టం చేశారు. ఈనెల 1న ఆమె వరికుంటపాడు మండలంలో తుఫాన్‌కు దెబ్బతిన్న పంటపొలాలను పరిశీలించారు. రైతులతో స్వయంగా మాట్లాడి వారి బాధలు విన్నారు. రైతాంగానికి ప్రభుత్వం ఎల్లవేళలా అండదండగా ఉంటుందని, అన్నదాతలకు అవసరమైన చేయూతనిస్తుందని ఆమె రైతులకు భరోసా ఇచ్చారు. జిల్లాలో ఈ తుఫాన్ ధాటికి 33వేల హెక్టార్లలో వరి, మినుము, పెసర, మొక్కజొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయని ఆమె తెలిపారు. ముఖ్యంగా ఉదయగిరి, వింజమూరు డివిజన్లలో మినుము పంట పూర్తిగా దెబ్బతినిందని చెప్పారు. పరిహారం వివరాలను రైతుభరోసా కేంద్రాల వద్ద ప్రకటిస్తామని, వాటిలో నష్టపోయిన రైతుల వివరాలేమైనా లేకుంటే రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పంటలకు 43 కోట్ల రూపాయల దాకా నష్టం జరిగివుంటుందని అంచనా వేయడం జరిగిందని తెలిపారు.

# నావెల్ క్యాడెట్ల ర్యాలీ

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా నెల్లూరులోని 10వ ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి కమాండింగ్ అధికారి కెప్టెన్ జివిఎస్ యుగంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 1న ర్యాలీ నిర్వహించారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఆర్టీసి బస్టాండు దాకా ర్యాలీ నిర్వహించి ఎయిడ్స్ వల్ల కలిగే అనర్థాలను సూచించారు ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎన్.ప్రభాకర్, విజయ్, మహేష్, సందీప్ తదితరులతో పాటు విఆర్‌సి, సర్వోదయ కళాశాలలు, విడవలూరు డిగ్రీ కాలేజీ ఎన్‌సిసి క్యాడెట్లు పాల్గొన్నారు.

### పేద గిరిజనులకు

# దుస్తుల వితరణ

నెల్లూరు రూరల్ మండలంలోని అంబాపురం గిరిజనకాలనీలో ఉన్న రూడ్స్ స్వచ్ఛంధసంస్థ ఈనెల 29న 40 కుటుంబాల నిరుపేద గిరిజనులకు వితరణగా దుస్తులు పంపిణీ చేసి తన సేవాభావాన్ని చాటుకుంది. సంస్థ ఛైర్మెన్ రసూల్, సభ్యులు రాజేష్, నారాయణ, సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

### చలికి తట్టుకోలేక..

# మూగజీవాల మృత్యువాత

నివర్ తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీవర్షాలు, చలిగాలులకు తట్టుకోలేక వరికుంటపాడు మండలంలోని తూర్పు బోయమడుగుల గ్రామం మాగంటి మాల్యాద్రికి చెందిన నాలుగు గొర్రెలు, నార్త్ కొండాయపాళెంలో వంటేరు లక్ష్మీనారాయణకు చెందిన మరో 20 గొర్రెలు మృత్యువాత పడినట్లు సమాచారం. అధికారులు స్పందించి ప్రభుత్వం నుంచి తమకు పరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### కృష్ణార్జునులు నిర్మిస్తున్న.. నెల్లూరోళ్ల సినిమా

# 'థ్యాంక్ యు బ్రదర్'



తన సేవా కార్యక్రమాలతో యువతను చైతన్యవంతుల్ని చేసి గుర్తింపు సాధించిన మాగుంట శరత్‌చంద్రారెడ్డి(చందు) తన బావ బొమ్మిరెడ్డి తారకనాథ్‌రెడ్డితో కలసి సినిమారంగంలో అడుగుపెట్టాడు. కృష్ణార్జునులిద్దరూ నిర్మాతలుగా జస్ట్ ఆర్డినరీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పైన 'థ్యాంక్ యు బ్రదర్' అనే పేరుతో సినిమా తీస్తున్నారు. ఈ సినిమా అన్ని హంగులు పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైనట్లు సినీ వర్గాల సమాచారం. సేవ, రాజకీయం, సినిమా ఇవన్నీ గ్లామర్ ఫీల్డ్‌లే. చందు ముందుగా సేవారంగాన్ని వేదికగా చేసుకుని ప్రాచుర్యాన్ని పొందాడు. తరువాత రాజకీయ ఆరంగేట్రం చెయ్యాలన్న ఆకాంక్షతో చిన్న తప్పటడుగు వేశాడు. తాను చేసిన తప్పును వెంటనే గ్రహించి రాజకీయాలకు ప్రస్తుతానికి విరామం ప్రకటించి ఇక ఇప్పుడు సినిమా రంగంపై దృష్టి పెట్టాడు.

అశ్విన్ విరాజ్, అనసూయ భరద్వాజ్ ప్రధాన పాత్రధారులుగా వస్తున్న ఈ సినిమాకి రమేష్ రాపర్తి అనే కొత్త దర్శకుడు దర్శకత్వం వహించాడు. తొలిసారిగా విడుదలచేసిన పోస్టర్‌లోనే 'థ్యాంక్ యు బ్రదర్' అంటూ నిండుగర్భంతో ఉన్న హీరోయిన్ హీరో వైపు సీరియస్‌గా చూస్తుండడం ఏదో కొత్తదనాన్ని దర్శకుడు చూపించబోతున్నాడన్న టాక్ ఇప్పటికే ఇండస్ట్రీలో నడుస్తోంది. జస్ట్ ఆర్డినరీ ఎంటర్టైన్మెంట్ అంటూ కృష్ణార్జునులు మాగుంట శరత్‌చంద్రారెడ్డి, తారకనాథ్ బొమ్మిరెడ్డిలు చేస్తున్న ఈ కొత్త ప్రయోగం విజయవంతం కావాలని ఆశిద్దాం!

# ఎయిడ్స్ పట్ల అవగాహనతో ఉండాలి

**విఎస్‌యు వీసీ సుదర్శన్‌రావు**



ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పట్ల అవగాహనతో ఉండాలని విఎస్‌యు వీసీ సుదర్శన్‌రావు అన్నారు. ఈనెల 1న ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా విఎస్‌యులో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఎయిడ్స్ అంటేనే భయపడేవారని, ఇప్పుడలాంటి పరిస్థితి లేదని, తరచూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నందువల్ల ప్రజల్లో ఆ వ్యాధి పట్ల బాగా అవగాహన కలుగుతోందని, ఎయిడ్స్ వ్యాధి నియంత్రణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో కృషిచేస్తున్నాయన్నారు. విఎస్‌యు రెక్టార్ చంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, పరీక్షల నియంత్రణాధికారి సివిస్ సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుజయ్‌కుమార్, అల్లం ఉదయ్‌శంకర్, సాయిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో... శ్రీ సుదర్శన లక్ష్మీనృసింహ యాగం

జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో వెలసివున్న శ్రీ పెనుశిల లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గత నెల 29న లోకకల్యాణం కోసం శ్రీ సుదర్శన లక్ష్మీనృసింహ యాగాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రీవారి అలంకార మండపంలో నిర్వహిస్తున్న ఈ యాగం కార్తీక సోమవారం రోజున కూడా కొనసాగించి పూర్ణాహుతితో ముగించారు. ఈ సందర్భంగా శ్రీవారితో పాటు ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి అమ్మవార్లను, సీతా సమేత శ్రీరామచంద్రమూర్తిని, రుక్మిణీ సత్యభామ శ్రీకృష్ణులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల వేదమంత్రాలతో అయిదు హోమగుండాల్లో శ్రీ సుదర్శన లక్ష్మీనృసింహ మూలమంత్ర హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సీతారామయ్యస్వామితో పాటు పెంచలయ్యస్వామి, శశిస్వామి, వినోద్‌స్వామి, త్రినాథ్‌స్వామి, నాగరాజస్వామి, మల్లికార్జునస్వామి, ప్రసాద్ తదితరులు పాల్గొని శాస్త్రోక్తంగా ఈ యాగం నిర్వహించారు.

**Please note the change**

www.lawyerteluguweekly.com

is now

www.lawyerpatrika.com

● భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు

# దీపకాంతులతో శోభిల్లిన.. ఆలయాలు



పరమేశ్వరునికి అత్యంత ప్రీతిపాత్ర మైన కార్తీక పౌర్ణమిని జిల్లా ప్రజలు గతనెల 30న ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కార్తీకమాసం మూడవ సోమవారం సందర్భంగా ఆలయాల్లో దీపోత్సవాలు నిర్వహించారు. దీంతో ఆలయాలు దీపకాంతులతో దేదీప్యమానమయ్యాయి. అనేక ఆలయాల్లో ఆకాశదీపాలను కూడా వెలిగించారు. జొన్నవాడ శ్రీ కామాక్షితాయి సమేత శ్రీ మల్లికార్జునస్వామి వారి సన్నిధి, గండవరంలోని ఉదయకళేశ్వరస్వామి ఆలయం, సోమశిలలోని సోమేశ్వరాలయం, సంగంలోని సంగమేశ్వరాలయం, కోటితీర్థంలోని కోటేశ్వరస్వామి వారి ఆలయం, సిద్ధలయ్యకోన తదితర ప్రముఖమైన ఆలయాలతో పాటు ఆయా ప్రాంతాల్లోని అన్ని ఆలయాలు భక్తులతో క్రిక్కిరిసిపోయాయి. శివాలయాలన్నీ 'ఓం నమ:శివాయ'.. 'హరహర మహాదేవ.. శంభో హరహర'.. అంటూ శివ నామ స్మరణలతో మార్మోగాయి.

చిన్నాపెద్దా అంతా కలసి కుటుంబాలతో సహా ఆలయాలకు విచ్చేసి కార్తీక దీపాలు వెలిగించడంతో ఆలయాలు కార్తీక కళలతో తళతళలాడాయి. ఆయా ప్రాంతాల్లోని అనేక మంది ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు ఆలయాలకు వచ్చి కార్తీక దీపోత్సవాల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళాభక్తులు పెద్దసంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి కార్తీక దీపాలు వెలిగించి పార్వతీపరమేశ్వరులను దర్శించుకుని పూజించి తరించారు. ఎంతో పుణ్యప్రదమైన ఈ రోజున అనేక మంది భక్తులు కార్తీక నోములు నోచుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయాలను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఆలయాల్లో శివపార్వతులకు శోభాయమానంగా పుష్పాలంకారాలు నిర్వహించి శాస్త్రోక్తంగా ప్రత్యేకపూజలు, రుద్ర హోమాలు, క్షీరాభిషేకాలు, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు వగైరా విశిష్ట పూజలు సేవలు చేశారు. కార్తీక కృత్తికా దీపంలో చంద్రదర్శనం చేసుకుని భక్తులు తమ ఉపవాసదీక్షలు విరమించారు.

## నగరంలో ఆలయాలకు పోటెత్తిన భక్తులు :

కార్తీక పౌర్ణమి సందర్భంగా నెల్లూరు నగరంలోని అనేక ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాలను విద్యుద్దీపాలతో, దేవతామూర్తుల కటౌట్‌లతో అలంకరించారు. ఎంతో భక్తిశ్రద్ధలతో ఆలయాల ప్రాంగణాల్లో శివనామ స్మరణలు చేసుకుంటూ పెద్దఎత్తున కార్తీక దీపాలు వెలిగించారు. నగరంలోని శివాలయాలన్నీ కార్తీక దీపకాంతులతో కళకళలాడాయి. నెల్లూరు మూలాపేటలోని భువనేశ్వరిదేవి సమేత శ్రీ మూలస్థానేశ్వరాలయంలో కార్తీకదీపోత్సవాలు అంగరంగవైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా వేకువ నుంచి క్షీరాభిషేకాలు, ప్రత్యేకపూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి, స్వామివారికి విశేష పూజలు చేశారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో 'మనగుడి' కార్యక్రమం నిర్వహించి ఎంతో వేడుకగా సహస్రదీపాలంకరణలు చేశారు. వివిధ ఆకృతులతో దీపాల వరుసలు పెట్టి ఎంతో వేడుకగా దీపోత్సవాలు నిర్వహించారు. దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో శ్రీ సుందరేశ్వర స్వామివారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు చేశారు. రంగనాయకులపేటలోని తల్పగిరి రంగనాధస్వామి ఆలయంలో కార్తీక దీపోత్సవం, ప్రాకారోత్సవం వేడుకగా జరిగాయి. శబరి శ్రీరామక్షేత్రంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం చేసి అభిషేకాలు చేశారు. నవాబుపేటలోని శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. భక్తులు ఉత్సాహంగా కార్తీక దీపాలు వెలిగించారు.

### కోవిడ్ సమయంలో..

# మీ సహకారం అపూర్వం

**డిజిపికి కృతజ్ఞతలు చెప్పిన శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి**



కోవిడ్ సమయంలో శ్రీసిటీ పోలీసు సిబ్బంది సేవలు, సహకారం అపూర్వమని, శ్రీసిటీ పరిసర ప్రాంతాలన్నీ కంటైన్మెంట్ జోన్లుగా ఉన్నప్పటికీ పోలీసుల నిరంతర కృషితో శ్రీసిటీని కరోనా రహిత ప్రాంతంగా కొనసాగించగలిగామని శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి డిజిపి గౌతం సవాంగ్‌కు తన కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 1న ఆయన మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో డిజిపి గౌతం సవాంగ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీసిటీ ప్రాంతంలో వేగవంతమైన పారిశ్రామికీకరణ, అనేక నిర్మాణ కార్యకలాపాల కారణంగా పెద్దసంఖ్యలో కార్మికుల నివాసంతో పాటు విదేశీ ప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ జనాభా కూడా పెరుగుతోందని, దీనికనుగుణంగా శ్రీసిటీ ప్రాంతంలో రక్షణ మరింతగా పెంపొందించిన పోలీసుశాఖకు తన హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నానన్నారు. పారిశ్రామిక కార్యకలాపాల పున:ప్రారంభానికి దోహదం చేసిన చిత్తూరు, నెల్లూరు, తిరువళ్లూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్‌లు తీసుకున్న చొరవను ప్రస్తావిస్తూ అందరికీ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోవిడ్ వైరస్ వ్యాప్తిని నియంత్రించడంలో శ్రీసిటీ యాజమాన్యం అమలుచేస్తున్న చురుకైన చర్యలను డిజిపి గౌతం సవాంగ్ ప్రశంసించారు.

## శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో.. పుస్తకాలు



శ్రీసిటీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓమ్ని ఆటో పరిశ్రమ యాజమాన్యం వితరణతో శ్రీసిటీ పరిధిలోని ఇరుగుళం, మాదనపాళెం ప్రభుత్వ హైస్కూళ్ళకు సుమారు 35వేల రూపాయల విలువచేసే పుస్తకాలను ఓమ్ని పరిశ్రమ ప్రతినిధి అజిత్, శ్రీసిటీ సెక్యూరిటీ ఇన్‌చార్జి వై.రమేష్ చేతుల మీదుగా ఆ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలల హెడ్మాస్టర్లు కాశీ మధు, మునిమోహన్‌లు వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

---

## గూడూరు డివిజన్ వార్తలు

### నివర్ ప్రభావిత ప్రాంతాల్లో

# సబ్‌కలెక్టర్ రోణంకి పర్యటన



నివర్ తుఫాన్ ప్రభావంతో బాలాయపల్లి మండలంలోని చుట్టి గ్రామంలో దెబ్బతిన్న చెరువుకి వెంటనే మరమ్మతులు మొదలుపెట్టాలని గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ అధికారులకు సూచనలు చేశాడు. ఇటీవల ఆయన నివర్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంలో అధికారులకు పలు సూచనలిచ్చాడు. చుట్టి గ్రామంలో నివర్ తుఫాన్ వల్ల కలిగిన ఇబ్బందులు గురించి గ్రామ ప్రజలను అడిగి తెలుసుకుని, సమస్యలు సత్వరమే పరిష్కారం అయ్యేలా చూస్తామని సబ్‌కలెక్టర్ గ్రామస్థులకు తెలియచేశాడు. అలాగే, నివర్ తుఫాన్ వల్ల నీట మునిగిన వెంకటగిరి పట్టణంలోని సవారీగుంట కాలనీ లోతట్టు ప్రాంతాలను సందర్శించిన గోపాలకృష్ణ వెంటనే నీటిని తొలగించి కాలనీవాసులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించాడు.

## మహిళలకు దుప్పట్లు, చీరలు



గూడూరు డివిఎన్ఆర్ కమ్యూనిటి హాలులో గత నెల 29వ తేదీ వైజేపీ లయన్స్ అధ్యక్షుడు నవీన్ జయకుమార్ ఆధ్వర్యంలో కె.బాబురావు దాతృత్వంతో సుమారు 56 మంది నిరుపేద మహిళలకు దుప్పట్లు, చీరలు, భోజన ప్యాకెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కోవిడ్-19 నివారణ గురించి కూడా వారికి తెలియపరిచారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు మదనంబేటి రమణయ్య, వి.వి.సుబ్బయ్య, బండ్ల సుధాకర్, స్వరూప్‌రెడ్డి, పి.వి.శివరామ్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలెక్కిన 'సింహపురి'

గూడూరు - సికింద్రాబాద్‌ల మధ్య నడిచే 'సింహపురి' సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 3వ తేదీ నుండి తిరిగి పట్టాలెక్కింది. కరోనా కారణంగా గత 10 నెలల నుండి 'సింహపురి' సేవలు నిలిచిపోయాయి. ఇప్పుడు తిరిగి పట్టాలు ఎక్కడంతో సింహపురి వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## హామ్ సేవలు స్ఫూర్తిదాయకం

**- పట్టణ సీఐ దశరధరామారావు**



హిందుస్థాన్ యునైటెడ్ ముస్లిమ్స్ సంస్థ సభ్యుల సేవలు స్ఫూర్తిదాయకమని పట్టణ సీఐ జి.దశరధరామారావు అన్నారు. మంగళవారం హామ్ సంస్థ గూడూరు శాఖ అధ్యక్షులు షేక్ సద్దామ్‌హుస్సేన్ ఆధ్వర్యంలో పూలతోట గిరిజన కాలనీలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హామ్ సంస్థ సభ్యులు పట్టణంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, నివార్ తుపాన్, కరోనా విపత్తులలో హామ్ సంస్థ సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. చలికాలాన్ని దృష్టిలో ఉంచుకుని దుప్పట్లు పంపిణీ చేయడం సంతోషంగా ఉందన్నారు. మరొక అతిథి ఇన్సాఫ్ కమిటీ గూడూరు డివిజన్ అధ్యక్షులు షేక్ జమాలుల్లా మాట్లాడుతూ పట్టణంలో పదికి పైగా మైనారిటీ స్వచ్ఛంద సంస్థలు విపత్కర పరిస్థితులలో మేమున్నామంటూ ముందుకొచ్చి నిరుపేదలకు ఆపన్నహస్తం అందిస్తున్నాయన్నారు. హామ్ సంస్థ సభ్యులు విపత్తు సమయాలలో వేగంగా స్పందిస్తూ తమ వంతు సహకారం ఆందిస్తుండడం హర్షణీయమని కొనియాడారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

# దెబ్బతిన్న రైతాంగాన్ని వెంటనే ఆదుకోవాలి

**- మాజీమంత్రి సోమిరెడ్డి**



నివర్ తుఫాన్ రాష్ట్రవ్యాప్తంగా రైతాంగాన్ని బాగా దెబ్బతీసిందని, లక్షలాది ఎకరాల్లో పంటలను నష్టపోయిన రైతుల బాధలు వర్ణనాతీతమని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. గతనెల 30న ఆయన నెల్లూరులోని టిడిపి కార్యాలయంలో టిడిపి నాయకులు అబ్దుల్ అజీజ్, కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డిలతో కలిసి మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 12 లక్షల ఎకరాలకు పైగానే నివర్ తుఫాన్‌కు దెబ్బతిని దాదాపు 8వేల కోట్ల దాకా రైతాంగానికి నష్టం వాటిల్లిందని అన్నారు. టిడిపి హయాంలో ఇలాంటి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతులకు వీలైనంత సాయం అందజేశామని, ఇప్పుడా పరిస్థితి ఇప్పటి ఎమ్మెల్యేలకు లేకుండా పోయిందని, సిఎంను ఒప్పించి పేదలకు పరిహారం ఇప్పించే ప్రజాప్రతినిధులు ఇప్పుడు లేకపోవడం దురదృష్టకరమని అన్నారు. సిఎంతో అయిదు నిమిషాలు మాట్లాడేందుకు అనుమతి తీసుకోలేని నాయకులు ఇక పేదలకు, రైతులకు ఏం న్యాయం చేస్తారని ఆయన ప్రశ్నించారు. నష్టాలు అంచనా వేయాల్సిన అధికారులు క్షేత్రస్థాయిలో ఎక్కడా కనిపించడం లేదని, వ్యవసాయశాఖలో రైతుభరోసా పథకం తప్ప మరో పథకం లేకుండాపోయిందని విమర్శించారు. వరద ముంపునకు గురై జీవనోపాధి కోల్పోయిన పేదలకు 10వేల రూపాయలు సాయంతో పాటు 25 కిలోల బియ్యం అందించాలని, మగ్గం గుంతల్లో నీళ్ళు నిలిచి నష్టపోయిన చేనేత కార్మికులకు పాతికవేల వంతున సాయం అందించాలని ఆయన అంటూ ఇప్పటిదాకా కనీస నష్టం అంచనాల ప్రక్రియ కూడా చేపట్టకపోవడం విచారకరమన్నారు. జిల్లాలోనూ దాదాపు 8 లక్షల ఎకరాల్లో నారుమళ్ళు దెబ్బతిన్నాయని, నారేతలు వేసిన పంట పొలాలు కూడా నీటమునిగాయని, రైతాంగానికి 400కోట్ల దాకా నష్టం వచ్చిందని పేర్కొన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు 15వేల వంతున పరిహారం అందించాలని, అరటి-తమలపాకుల తోటల రైతులకు ఎకరాకు 25వేలు పరిహారం అందించాలన్నారు. పెన్నానదికి నీళ్ళు వదిలేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత నీటిపారుదల అధికారులపై ఉందని, అదేవిధంగా సోమశిల డ్యాం నిండిపోతోందని తెలిసినప్పుడు కూడా అధికారులు అప్రమత్తంగా లేకపోవడం ఏమిటని ఆయన ప్రశ్నిస్తూ నీటిపారుదల మంత్రి సొంతజిల్లాలోనే ఇంత లెక్కలేకుండా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా ఏంచేస్తారని ఆయన విమర్శించారు. నెల్లూరు పెద్దాసుపత్రిలో కరెంట్ పోయి రోగులు అల్లాడుతుంటే వెంటనే చర్యలు తీసుకోలేరా?..అంత నిర్లక్ష్యమా అని ఆయన మండిపడ్డారు.

## బాధితులకు నిత్యావసరాలు

మాజీమంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 29న వెంకటాచలం మండలంలోని తాటిపర్తి గ్రామంలో తుఫాన్ బాధితులైన 50 కుటుంబాల వారికి నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేశారు. టిడిపి నాయకులు రత్నయ్య, యనమల కృష్ణయ్య, రమేష్, రమణయ్య, పెంచలయ్య, సుధాకర్, భాస్కర్, సుమంత్ తదితరులు పాల్గొన్నారు.

## 3.67 లక్షల మందికి పింఛన్లు

వైయస్సార్ పింఛన్ కానుకలో భాగంగా 1వతేదీ నుండి జిల్లాలో 3,67,640 మందికి 91,11,66,000 రూపాయలను పంపిణీ చేస్తున్నారు. అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్న మరుసటి నెలలోనే పింఛన్లు మంజూరు చేసేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు.

Please note the change
www.lawyerteluguweekly.com
is now
www.lawyerpatrika.com

**తిరుమలమ్మపాళెం వద్ద**

# వంతెన నిర్మాణానికి కృషి చేస్తా

**- ఎమ్మెల్యే కాకాణి హామీ**



వెంకటాచలం మండలంలోని చివరిగ్రామమైన తిరుమలమ్మపాళెం వద్ద కండలేరు క్రీక్‌పై హైలెవల్ వంతెన నిర్మాణానికి కృషి చేస్తామని సర్వేపల్లి ఎమ్మెల్యే, వైయస్సార్సీపి నాయకుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. నివర్ తుఫాన్ నేపథ్యంలో ఈనెల 28న ఆయన తిరుమలమ్మపాళెం, పూడిపర్తి, కాకర్లవారిపాలెం గ్రామాల్లో బోటులో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ప్రతి వర్షాకాలంలోనూ తిరుమలమ్మపాళెంకు రావాలంటే ప్రజలు ఎంతగానో అవస్థలు పడుతున్నారని, కండలేరు క్రీక్‌పై హైలెవల్ వంతెన నిర్మిస్తే తప్ప ఈ సమస్యలు తీరవని ఆయన అన్నారు. తుఫాన్ వల్ల నష్టపోయిన రైతులను, అన్ని వర్గాల ప్రజలను ఆదుకునేందుకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటోందన్నారు. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న భారీ వానల వల్ల బాధలుపడుతున్న పేద ప్రజలకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా బియ్యం, నూనె తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాకాణితో పాటు వైకాపా నాయకులు మందల వెంకటశేషయ్య, వేమారెడ్డి రఘునందన్‌రెడ్డి, కనుపూరు కోదండరామిరెడ్డి, కట్టంరెడ్డి విజయమోహన్‌రెడ్డి, దక్కిలి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# 'నివర్' బాధితులను ఆదుకోండి

**- కిసాన్‌మోర్చా రాష్ట్ర నాయకుని వినతి**

జిల్లాలో నివర్ తుఫాన్‌తో పంటలు దెబ్బతిన్న రైతులను, లోతట్టు ప్రాంతాల్లో అష్టకష్టాలు పడుతున్న ప్రజలను వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని రాష్ట్ర కిసాన్‌మోర్చా కార్యదర్శి సిహెచ్ సుబ్రహ్మణ్యం కోరారు. పొదలకూరు మండలంలో నీట మునిగిన పొలాలను ఆయన ఈనెల 29న పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్‌కు నష్టాలపాలైన మినుము, పెసర, వేరుశెనగ రైతులను, ఉద్యానపంటల రైతులను ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకోవాలని, బాధితులకు తక్షణ సాయం కింద 2వేల రూపాయలు అందించాలని, దెబ్బతిన్న చెరువులను మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బిజెపి నాయకులు రాచపూటి ధనుంజయ, అమర్‌నాథ్‌రెడ్డి, అంకిరెడ్డి, రామయ్య, ఓబులేశు, ప్రశాంత్, పిచ్చయ్య తదితరులున్నారు.

## అరుదైన ఏకశిలా ధ్వజస్తంభంతో అలరారే

# వెంకటగిరి.. శ్రీ కాశీ విశ్వనాధాలయం

*కాశీ విశ్వనాథస్వామి ఆలయాన్ని దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదమని వేరే చెప్పనక్కర లేదు. ఎందుకంటే..'సర్వ పాపహరం..సకల శుభకరం కాశీ విశ్వనాథుని దర్శనం' అన్నారు పెద్దలు. కష్టాలు తీర్చి కోరిన కోరికలు తీర్చే దైవంగా కాశీ విశ్వనాథుడు ప్రసిద్ధి. ఒక్క కాశీలోనే కాదు అలాంటి ఆలయం ఎక్కడున్నా సరే దర్శించుకోవడం ఎంతో పుణ్యప్రదం. అలాంటి దివ్యమైన ఆలయాల్లో ఒకటి నెల్లూరుజిల్లాలోని వెంకటగిరిలో కూడా ఉంది. సుమారు రెండున్నర శతాబ్దాల నాటి ఆలయం ఇది. కైవల్యానది ఒడ్డున నిర్మితమైన ఈ ఆలయం ఆధ్యాత్మికతకే చెక్కిన గోపురంలా నేటికీ వెలుగొందుతోంది. అందులోనూ దక్షిణ భారతదేశంలోనే ఎంతో అరుదైన ఏకశిలా ధ్వజస్తంభం ఇక్కడ ఉండడం.. ఈ ఆలయం ప్రత్యేకత.*

నెల్లూరు జిల్లాలోని వెంకటగిరి శివాలయం(శ్రీ కాశీ విశ్వనాధుని ఆలయం) ఎంతో అపూర్వమైనది. సుమారు రెండు వందల నలభై ఏళ్ళ క్రితం నాటి ఈ ఆలయం భక్తులందరికీ కొంగుబంగారంగా ఉంది. అప్పట్లో వెంకటగిరి రాజులు నిర్మించిన ఈ ఆలయానికి ఎంతో ఘనమైన చరిత్రతో పాటు ఆసక్తికరమైన కథనం కూడా ఉంది.





మన దేవాలయాలు 23

### ఆలయ చరిత్ర :

వెంకటగిరి సంస్థానాధీశుడైన రాజా వెలుగోటి బంగారు యాచమనాయుడు 1790 ప్రాంతాల్లో వెంకటగిరి ప్రాంతాన్ని పరిపాలిస్తున్న కాలంలో ఈ ఆలయం నిర్మితమైనట్లు చరిత్ర. ఒక రోజున శ్రీ కాశీ విశ్వనాధుని ఆలయాన్ని తాను నిర్మించినట్లుగా కల వచ్చిందని, దాంతో ఆయన ఎలాగైనాసరే ఆ ఆలయాన్ని నిర్మించాలని పట్టుబట్టి ఈ అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాడని కూడా కథనాలున్నాయి. ఈ ఆలయంలో ప్రతిష్టించడానికి రాజా వారు అప్పట్లో ఏకంగా కాశీ క్షేత్రం నుంచే ఒక శివలింగాన్ని తెప్పించి ఇక్కడ ప్రతిష్టించడంతో ఈ ఆలయం శ్రీ కాశీ విశ్వనాధాలయంగా.. కాశీ విశ్వేశ్వరాలయంగా ప్రసిద్ధిలోకి వచ్చిందని అంటుంటారు. ప్రధాన గోపురంతో పాటు 12గోపురాలతో ఈ ఆలయం ఎంతో సుందరంగా ఉంటుంది. ఆలయం మొత్తం ఆగమ వాస్తు ప్రకారం నిర్మితమైంది. నిత్యపూజలు, సేవలతో పాటు శ్రీ కాశీ విశ్వేశ్వరాలయంలో వెంకటగిరి రాజులు ఏటా మే నెలలో పెద్దఎత్తున తిరునాళ్ళు జరిపేవాళ్ళు. ఇందుకోసం ప్రత్యేకమైన రథాలు, చప్పరాలు, పట్టణంలోని ప్రధాన వీధుల్లో మండపాలు కూడా నిర్మించారు. అవి నేటికీ ఉన్నాయి. అప్పట్లో ఈ తిరునాళ్ళకు ఇసకేసినా రాలనంత జనం వచ్చేవారు. అంత భారీగా, 11 రోజుల పాటు అత్యంత వైభవంగా జరుగుతుండేది స్వామివారి తిరునాళ్ళ. దీంతో ఈ తిరునాళ్ళకు 'వెంకటగిరి తిరునాళ్ళ' అనే పేరు వచ్చింది.



కాశీ విశ్వనాధుని ఆలయంలో నిర్మించడం కోసం వెంకటగిరి రాజా వారు అప్పట్లో తొలుత 84 అడుగుల ఎత్తున్న ఏకశిలా ధ్వజస్తంభాన్ని తయారు చేయించారు. అయితే, వెంకటగిరికి 10 మైళ్ల దూరంలో ఉన్న పల్లాం గ్రామం వద్ద ఉన్న కొండల నుంచి ఒకే రాతితో ఎంతో అపురూపంగా నిర్మించారు. ఈ ధ్వజస్తంభాన్ని కొండప్రాంతాల నుంచి తీసుకువస్తుండగా కొంతభాగం విరిగిపోయిందని, మిగిలిన 60 అడుగుల ధ్వజస్తంభాన్ని ఆలయంలో ప్రతిష్టించారని తెలుస్తోంది. ఈ ధ్వజస్తంభానికి నాలుగు వైపులా బ్రహ్మ, విష్ణు, శివ రూపాలతో పాటు శక్తి రూపాలను కూడా శిల్పులు అత్యద్భుతమైన రీతిలో రూపు దిద్దారు. ధ్వజస్తంభం పైభాగంలో కమలం, కిందిభాగంలో ఉత్తర, దక్షిణ దిశల్లో నంది విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఎంతో అపూర్వమైన ఈ ఏకశిలా ధ్వజస్తంభంతో ఈ ఆలయానికి మరింత ఖ్యాతి వచ్చింది. బంగారు యాచమనాయుడి తర్వాత ఆయన కుమారుడు కుమార యాచమనాయుడు ఈ ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేశారు. నాటి కాలం నుంచి నేటి దాకా వెంకటగిరి రాజుల పర్యవేక్షణలో ఈ ఆలయంలో పూజలు, ఏటా శివరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. భక్తవరదుడైన శ్రీ కాశీ విశ్వనాధుని దర్శించుకునేందుకు జిల్లావ్యాప్తంగా భక్తులు వెంకటగిరికి విచ్చేస్తూ ఉంటారు.

# కల్యాణ వైభవం...!

ప్రణీత్‌రెడ్డి - స్మితిరెడ్డి



ప్రముఖ వైద్యులు, విజయ నర్సింగ్‌హోమ్ అధినేత డా. సామంతు వెంకటకృష్ణారెడ్డి - విజయలక్ష్మిల కుమారుడు (సామంతు రఘురామరెడ్డి మనుమడు) ప్రణీత్‌రెడ్డి - స్మితిరెడ్డి (హైదరాబాద్ వాస్తవ్యులు శీలం విజయభాస్కర్‌రెడ్డి - అర్చనల కుమార్తె)ల కళ్యాణం నవంబర్ 20వ తేదీ హైదరాబాద్‌లో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాభినందనలు.

మానస - దినేష్



ఆర్‌ఆర్ యాడ్స్ యజమాని కోటంరెడ్డి రాజేశ్వరరెడ్డి - లేట్ సులోచనల కుమార్తె మానస - దినేష్ (నెల్లూరు, పెదచెరుకూరు వాస్తవ్యులు యర్రంరెడ్డి రామమోహన్‌రెడ్డి - సంధ్యల కుమారుడు (యర్రంరెడ్డి బాలకృష్ణారెడ్డి మనుమడు))ల పెళ్ళి నవంబర్ 25వ తేదీ నెల్లూరులో జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' దీవెనెలు.

# 'నివర్' పోయింది.. 'బురేవి' వచ్చింది

## • తుఫాన్‌లతో జిల్లా గడగడ

'నివర్' పోయి..'బురేవి' వచ్చింది. ఒకదాని వెనుక మరొకటిగా ఈ రెండు తుఫాన్లు జిల్లాను వణికించేస్తున్నాయి. ఇప్పటికే జిల్లాకు భారీ నష్టం చేసి వెళ్ళిన 'నివర్'.. పోయింది కదా అని అనుకుంటున్న సమయంలో 'బువేరి' నేనున్నాంటూ దూసుకు వచ్చేసింది. బువేరి దెబ్బకు 3వ తదీ గురువారం జిల్లా అంతా ముసురుపట్టి వానలు కురుస్తూ అంతా తుఫాన్ వాతావరణం అలముకుంది. ఇప్పటికే ఈదురుగాలులు, వాన.. చలిగాలులతో ప్రజలు ఇళ్ళలోంచి బయటకు రాలేని పరిస్థితి. శుక్రవారం రోజున ఇది మరింత ప్రతాపం చూపుతుందేమోనని ప్రజలు భయపడుతున్నారు. నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తొలుత వాయుగుండంగా, ఆపై మరింతగా బలపడి తుఫాన్‌గా మారిందని, దీనికి 'బురేవి' అని పేరు పెట్టామని భారత వాతావరణశాఖ పేర్కొంది. ఈనెల 3న గురువారం అర్ధరాత్రి లేదా శుక్రవారం వేకువన తమిళనాడులోని పాంబన్-కన్యాకుమారి మధ్య తీరం దాటుతుందని, దీని ప్రభావంతో శుక్ర, శనివారాల్లో ప్రకాశం, నెల్లూరు, చిత్తూరుజిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# 34కు దిగిన కరోనా

జిల్లాలో ఈనెల 3వ తేదిన కరోనా పాజిటివ్ కేసులు 34కు దిగాయి. గతంలో వందలో సంఖ్యలో వస్తున్న కేసులు క్రమేణా తగ్గిపోతుండడం, ఇప్పటికే ఈ వ్యాధి బారిన పడి ఆసుపత్రుల్లో ఉంటున్నవారు కూడా నెమ్మదిగా కోలుకుంటుండం సంతోషదాయకం. జిల్లాలో మొత్తంగా ఇప్పటికి 63,097 మంది కరోనా బారిన పడ్డారు. 576 మంది చనిపోయారు. 62,395 మంది కోలుకుని డిశ్చార్జి కాగా, మరో 702 మంది వివిధ ఆసుపత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు.

# 'తలైవా' కొత్త పార్టీ

(3వ పేజీ తరువాయి)

వేదికగా ప్రకటించేశాడు. 2021 ఎన్నికల్లో బరిలోకి దిగబోతున్నట్లు కూడా స్పష్టం చేశాడు. డిసెంబర్ 31న పార్టీకి సంబంధించి అన్ని వివరాలు వెల్లడిస్తానని తలైవా పేర్కొన్నాడు. మొత్తానికి ఈ సూపర్ స్టార్‌ని పైవాడు ఆదేశించినట్టున్నాడు. పార్టీ ప్రకటనతో రజనీకాంత్ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. తలైవానే తమిళనాడు తదుపరి సీఎం అంటూ నినదిస్తున్నారు.

# కోటి ఆశల నడుమ కోవిడ్ టీకా!

(మొదటి పేజీ తరువాయి)

సమర్ధనీయంగా పనిచేశాయన్నది కాదనలేని నిజం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ ఈ విషయంలో మిగతా రాష్ట్రప్రభుత్వాలకన్నా ఒకడుగు ముందే ఉంది. కోటి మందికి పైగా పరీక్షలు చేసిన మైలురాయిని కూడా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం దాటింది. దేశంలో కోటిమందికి పరీక్షలు చేసిన మొట్టమొదటి రాష్ట్రంగా ఘనత కూడా సాధించింది. ఇలాంటి తరుణంలో టీకా వచ్చేస్తోందన్న సమాచారం ఆనందాన్ని కలిగిస్తోంది.

ప్రధానమంత్రి మోడీ చేసిన మెరుపు పర్యటనతో పాటు, కేంద్ర మంత్రుల దగ్గరనుండి జిల్లా కలెక్టర్ల వరకు ఇస్తున్న ప్రకటనలు చూస్తుంటే ఈ వార్తలకు బలం చేకూరుతోంది. వచ్చే ఏడాది ఆగస్టు కల్లా దేశంలో 30 కోట్ల మందికి కరోనా వైరస్ వ్యాక్సిన్ అందజేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి హర్షవర్ధన్ ఇటీవల చెప్పడం, వచ్చే ఏడాది తొలి నాలుగు నెలల్లోపు దేశ ప్రజలకు కరోనా టీకా అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని కూడా ఆయన పేర్కొనడం దేశ ప్రజల్లో ఆశలు చిగురింపజేస్తున్నాయి. మన శాస్త్రవేత్తలూ సరైన సమయానికి వ్యాక్సిన్ అందుబాటులోకి తెచ్చేందుకు నిరంతర కృషి చేస్తున్నారు అని కూడా హర్షవర్ధన్ చెప్పడం గమనార్హం.

## జిల్లా స్థాయిలో ఏర్పాట్లు...

జిల్లా స్థాయిలో చూస్తే త్వరలో జిల్లాకు కరోనా వాక్సిన్ రాబోతోందని డిసెంబర్ 2వ తేదీ నెల్లూరు జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు చేసిన ప్రకటన కూడా పై వార్తలన్నిటిని బలపరుస్తోంది. కోవిడ్-19 నిరోధక వ్యాక్సిన్ త్వరలో కేంద్ర ప్రభుత్వం నుండి రాష్ట్ర ప్రభుత్వానికి, అక్కడి నుండి జిల్లాకు రానున్న నేపధ్యంలో స్టోరేజీ పాయింట్స్ ఏర్పాటుకు తగు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించాడు. వ్యాక్సిన్ వేసేందుకు గ్రామ స్థాయిలో ఉన్న ఏఎన్ఎమ్ నర్సులు, ఆశ వర్కర్లకు ముందుగానే తగు శిక్షణ ఇవ్వాలని కూడా ఆయన సూచించాడు.

వ్యాక్సిన్ వేసే కార్యక్రమం 5 దశల్లో నిర్వహించబడుతుందని, మొదటి దశలో ఆరోగ్య కార్యకర్తలు, డాక్టర్లు, నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ఆయుష్ ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యులు, ప్రైవేట్ హాస్పిటల్ వైద్యులకు వ్యాక్సినేషన్ వేయాల్సి ఉంటుందని, 2వ దశలో కోవిడ్ ఫ్రంట్ వారియర్స్‌గా వ్యవహరించిన పోలీసులు, మున్సిపల్ సిబ్బందికి, మూడోదశలో 50ఏళ్లు పైబడిన వారికి, నాలుగో దశలో 50లోపు వయసు కలిగిన వారికి, 5వ దశలో మిగతా అందరికీ వ్యాక్సినేషన్ వేయాల్సి ఉంటుందని కలెక్టర్ వివరించాడు, జిల్లాలో గ్రామ, పట్టణాల వారీగా డేటా సేకరించాలని, కోవిడ్ వ్యాక్సిన్ రవాణాకు వాహనాలు సిద్ధం చేసుకోవాలని కూడా అయన ఆదేశించాడు.

పై పరిణామాలన్నీ గమనిస్తే కోవిడ్ నివారణ టీకా వచ్చేసిందన్న శుభవార్త వినడానికి మనం ఇంక ఎక్కువ కాలం నిరీక్షించాల్సిన అవసరం లేదన్నది స్పష్టమవుతోంది. కేంద్ర మంత్రి ఇచ్చిన ప్రకటన, జిల్లా కలెక్టర్ చేసిన సూచన, ప్రధానమంత్రి పర్యటన కోవిడ్ నివారణ టీకా విషయంలో భరోసా కల్పిస్తున్నాయనడంలో సందేహం లేదు. 2021 కొత్త సంవత్సరం శుభవార్తలతో, శుభ పరిణామాలతో ఆరంభం కావాలని ఆకాంక్షిద్దాం.

# ఉనికి కోసం పాట్లు.. 'దేశం' సర్కస్ ఫీట్లు

(మొదటి పేజీ తరువాయి)

హైలైట్ కావాలో బాబు ముందుగానే వ్యూహాన్ని రచించుకుని సభకి వచ్చాడన్నది స్పష్టమైపోయింది. ఆయన ఇక్కడితో ఆగకుండా ప్రెస్‌మీట్ పెట్టి సాక్షాత్తూ ముఖ్యమంత్రిని, మంత్రులనూ ఉద్దేశించి వాడూ వీడూ అని మాట్లాడి మరింత రచ్చకు తెర లేపడం చూస్తే మరో కొత్త అంశాన్ని లేవనెత్తి, కొత్త వివాదానికి ఆజ్యం పోసి, సభలో జరిగిన విషయాన్ని పక్కదోవ పట్టించడమే తన పథకంగా స్పష్టమైపోతుంది. ఆయన వీళ్ళని వాడు అని సంబోధిస్తే వీళ్ళు బాబుని ఒరే అనేస్థాయికి వివాదాన్ని పెంచుకుని మళ్ళీ అభాసుపాలయ్యాడు.



రాష్ట్రంలో శాంతి భద్రతలు కరువయ్యాయని, దళితులపై దాడులు జరుగుతున్నాయని అంటూ నిరసన వ్యక్తం చేస్తూ.. గురువారం నాడు చేతులకు గొలుసులతో మండలికి విచ్చేసిన చినబాబు

## రెండవ రోజూ అదే తీరు ...

రెండవరోజైన మంగళవారం సైతం దేశం వ్యూహంలో ఎలాంటి మార్పూ లేకపోవడం ఇళ్లస్థలాలు, టిడ్కో ఇళ్లు, ఇళ్ల స్థలాల పంపిణీ వంటి అంశాలపై వాయిదా తీర్మానం కోసం డిమాండ్ చేయడం, కుదరదని చెప్పిన స్పీకర్ పైన ఆగ్రహించి నువ్వెంత అంటే నువ్వెంతని వేలు చూపించడం, చివరికి సభనుండి సస్పెండ్ చేస్తే మొరాయించి మార్షల్స్ పై తిరగబడడం ఇవన్నీ పబ్లిసిటీ కోసమే బాబు చేస్తున్నాడన్నది స్పష్టమైపోయింది.

## 'జయము జయము చంద్రన్న' వీడియోతో నవ్వులపాలు....

ఇక మూడవరోజు 2వ తేదీ బుధవారం చంద్రబాబు సైకిలుకి పూర్తిగా గాలి తీసేశాడు ముఖ్యమంత్రి. పోలవరంపై చర్చలో ఘనతంతా తనదే అని చెప్పుకున్న చంద్రబాబు చేసిన ఘనకార్యాలను వీడియో రూపంలో సభలో ప్రదర్శింపచేశాడు సీఎం. దీంతో ఒక్కసారిగా సభలో కామెడీ సీన్ చూస్తున్నట్లుగా స్పీకరుతో సహా అందరూ పగలబడి నవ్వారు. పోలవరం సందర్శన పేరుతో తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను ప్రత్యేక బస్సుల ద్వారా తరలించి అక్కడ చంద్రబాబు లాంటి నాయకుడు ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం తెలుగువారి అదృష్టమని, పోలవరం హీరో చంద్రబాబే అని చెప్తూ 'జయము... జయము... చంద్రన్నా' అంటూ చిడతలతో భజన చేస్తూ చంద్రబాబుని కీర్తిస్తూ పాడే భజన గీతం చూసి, ఇంత నేరాలు, ఘోరాలు జరిగాయని మాకు తెలియదే అంటూ సభాపతి నవ్వుతూ కామెంట్ చేయడం కొసమెరుపు.

## నాలుగో రోజు వాకౌట్...

నాల్గవరోజు 3వతేదీ ఉదయం 'దిశ' బిల్లుపై మాట్లాడే అవకాశం ఇవ్వాలన్న బాబు కోరిక నెరవేరకపోవడంతో వాకౌట్ చేసి వెళ్ళిపోయారు బాబు బృందం. కేవలం 23మంది సభ్యులతో తానూ ఏమీ సాధించలేనన్నది బాబుకి బాగా తెలుసు, కానీ ఈ బాబు బాగా ముదురు కాబట్టి ప్రతి అంశాన్నీ వివాదాస్పదం చేసి ప్రచారం పొందాలని చూశాడు. అయితే జగన్మోహన్‌రెడ్డి ముందు ఆయన ఆటలు సాగలేదు, సంయమనం కోల్పోయి బాబు జీరో అయితే, సమయస్ఫూర్తితో జగన్ హీరో అయ్యాడు.

## సామాన్యులకు దూరమవుతూ...

# 'హేట్' బ్యాంకుగా మారుతున్న స్టేట్ బ్యాంకు

- ఖాతాదారులకు చుక్కలు చూపిస్తున్న సిబ్బంది
- స్టేట్ బ్యాంకు అంటేనే హడలిపోతున్న సాదా సీదా జనం

**భారతీయ బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా పిలువబడుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇప్పుడు 'హేట్' బ్యాంక్‌గా మారుతోందా ...? బ్యాంక్ ఖాతాదారుల పట్ల సిబ్బంది అవలంబిస్తున్న తీరు, విధినిర్వహణలో వాళ్ళు చూపిస్తున్న నిర్లక్ష్యం అకౌంటుదారులను ఆందోళనకు గురి చేస్తోందా....? అవుననే అంటున్నారు ఎస్‌బిఐ కష్టమర్లు. తమ పట్ల సిబ్బంది ప్రవర్తన, అడిగిన విషయానికి సమాధానం చెప్పడంలో వాళ్ళు చూపిస్తున్న అసహనం, రూల్ ప్రకారం చేయవలసిన పనిని కూడా కుంటి సాకులు చెప్పి తప్పించుకోవడం వంటి విషయాలతో ఆ బ్యాంకుపై విరక్తి కలుగుతుందంటున్నారు చాలామంది ఖాతాదారులు.**

ప్రభుత్వరంగం 56.92 శాతం వాటా కలిగి ఉండడం, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు అన్నీ స్టేట్ బ్యాంకు ద్వారానే లావాదేవీలు జరుపుతుండడడమే కాకుండా, ఉద్యోగుల జీతభత్యాలతో పాటు పదవీ విరమణ పొందిన ఉద్యోగుల పెన్షన్లు కూడా ఎక్కువశాతం ఈ బ్యాంకు ఖాతాలకే వస్తాయి. ఎవడైనా సచ్చినట్టు తమ బ్యాంకుకే రావాలన్న ధీమా, అహంభావం ఈ బ్యాంకు ఉద్యోగులలో ప్రస్ఫుటంగా కనిపిస్తుండడంతో సామాన్య అకౌంట్ హోల్డర్ల కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. స్టేట్ బ్యాంకు ఉద్యోగి అంటే తామేదో చాలాగొప్ప అన్నట్లుగా ఉన్న వాళ్ళ ప్రవర్తన అసలు ఆ బ్యాంకుపైనే అసహ్యం కలిగిస్తోందని ఖాతాదారులు అభిప్రాయపడుతున్నారు, ఆమ్మో! స్టేట్ బ్యాంకా అని సామాన్యుడు భయపడే స్థాయిలో ఈ స్టేట్ బ్యాంకు వ్యవస్థ భ్రష్టుపట్టిపోయింది.

### తాజా ఉదాహరణ...

తాజాగా తిరుపతిలో జరిగిన ఒక సంఘటన బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. చిత్తూరుకు(ఊరు పేరు మార్చాము) చెందిన కృష్ణ అనే స్టేట్ బ్యాంకు ఖాతాదారుడు తిరుపతిలో పద్మాకర్ అనే వ్యక్తి దగ్గర ఒక స్థలం కొనుగోలు చేశాడు. స్థలం అమ్మిన పద్మాకర్‌కి కూడా చెన్నై(ఊరు పేరు మార్చాము) స్టేట్ బ్యాంకులో ఖాతా ఉంది. పద్మాకర్ పేరుతో నవంబర్ 23వ తేదీ కృష్ణ 10లక్షలకి చెక్కు ఇచ్చాడు, ఇద్దరిదీ స్టేట్ బ్యాంకు అకౌంటే కావడం, ఇచ్చిన చెక్కుపైన MULTY-CITY CHEQUE Payable at Par at All Branches of SBI అని ఉండడంతో పద్మాకర్ ఆ చెక్కు తీసుకుని అదే రోజు ఉదయం తిరుపతిలోని గోవిందరాజస్వామి గుడి వెనుకవైపున ఉన్న ఎస్‌బిఐ మెయిన్ బ్రాంచ్‌కి వెళ్ళాడు, సహజంగానే స్టేట్ బ్యాంకు కాబట్టి చెక్కు తీసుకుని లైన్‌లో నిలబడి అక్కడ బ్యాంకు అధికారిని కలవడానికి పద్మాకర్‌కి అరగంట పట్టింది. తీరా చెక్కు చూసిన బ్యాంకు అధికారి ఇది ఇక్కడ ఎలా తీసుకుంటాం, మీకు గాని, లేదా చెక్కు ఇచ్చిన కృష్ణకి గాని మా బ్రాంచిలో అకౌంటు ఉండాలి అంటూ చెక్కు తీసుకుని డబ్బు బదిలీ చెయ్యడానికి నిరాకరించాడు.

అయ్యా! ఇది మల్టీ సిటీ చెక్కు. చిత్తూరులో ఉన్న కృష్ణ ఖాతా నుండి చెన్నైలో ఉన్న నా ఖాతాకి ఆన్‌లైన్ ద్వారా డబ్బు బదిలీ చెయ్యడమే కదా, పేయబుల్ ఎట్ పార్ ఎట్ ఆల్ బ్రాంచెస్ ఆఫ్ ఎస్‌బిఐ అంటే అర్థం ఏమిటి...? ఇప్పుడంతా ఆన్‌లైన్ లావాదేవీలే కదా...? అని ప్రశ్నించాడు పద్మాకర్. అంతే ఆ అధికారి అగ్గిమీద గుగ్గిలమైపోయాడట. నాకే రూల్స్ చెప్తావా, ఇది ఎస్‌బిఐ అంటూ చిందులేశాడంట. అంతే దెబ్బకు భయపడిపోయిన పద్మాకర్ తిరిగొచ్చేశాడు. అక్కడినుండి అన్నమయ్య సర్కిల్‌లో ఉన్న మరో శాఖకు వెళ్ళాడు. అక్కడా ఇదే పరిస్థితి.. వాళ్ళూ అలాగే చెప్పారు. వాళ్ళతో వాదించి నెగ్గలేని పద్మాకర్ తిరుపతి నుండి చిత్తూరుకి చెక్కు పంపించి అకౌంటులో డబ్బు బదిలీ అయిన తరువాత పక్కరోజు 24వ తేదీ రిజిస్ట్రేషన్ పెట్టుకున్నాడు. స్టేట్ బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం, అహంకార ధోరణి కారణంగా రిజిస్ట్రేషన్ ఒక రోజు ఆలస్యమయింది. ఫలితంగా చెన్నై నుండి తిరుపతికి వచ్చిన పద్మాకర్, చిత్తూరు నుండి తిరుపతికి వచ్చిన కృష్ణ ఇద్దరు ఒక రోజు తిరుపతిలోనే వేచి ఉండాల్సి వచ్చింది.

చూడండి... స్టేట్ బ్యాంకు సిబ్బంది పోకడ ఎంత విడ్డురంగా వుందో! తాము ఏం చెప్తే అదే వేదం అన్న చందంగా ఉన్న ఈ బ్యాంకు సిబ్బంది ప్రవర్తన చాలామంది ఖాతాదారులలో అసహనాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా రిటైర్డ్ ఉద్యోగులు మాత్రం తమకు మరో గత్యంతరం లేనట్లుగా ఇబ్బందులు పడుతూనే స్టేట్ బ్యాంకులో తమ ఖాతాలను కొనసాగిస్తున్నారు. ఎక్కువ శాతం ప్రభుత్వ ఖాతాలు కలిగి, అధిక శాతం వ్యాపారం వారిదే కావడంతో స్టేట్ బ్యాంకు సిబ్బందికి సాధారణ ఖాతాదారులంటే చిన్న చూపు. భారతదేశంలోనే అతిపెద్ద బ్యాంకుగా అవతరించిన ఈ స్టేట్ బ్యాంకు ఇప్పుడు 'హేట్' బ్యాంకుగా మారుతోందంటే... అందుకు కారణం సిబ్బంది నిర్లక్ష్య ధోరణే అన్న మాట సర్వత్రా వినిపిస్తోంది.

కనీస రూల్సు కూడా పాటించకుండా, తలతిక్క సమాధానాలు చెప్పి తప్పుడు సమాచారంతో తప్పించుకుంటున్న ఈ సిబ్బందిని మూర్ఖులని సంభోదించాలా లేక పనిదొంగలని పిలవాలో అర్థం కాక ఖాతాదారులు తలపట్టుకుంటున్నారు. ఇప్పటికైనా పై అధికారులు పట్టించుకుని బ్యాంకును సామాన్యులకు చేరువ చేసేలా చర్యలు చేపట్టకపోతే కొంత కాలానికి ఈ బ్యాంకు కేవలం ప్రభుత్వ లావాదేవీల బ్యాంకుగా చరిత్రలో మిగిలిపోవడం ఖాయమన్న అభిప్రాయం చాలామంది స్టేట్ బ్యాంకు కష్టమర్లలో వ్యక్తమవుతోంది.

---

## విఎస్‌యు డిగ్రీ పరీక్షలు 7 నుంచి

భారీ వర్షాల నేపథ్యంలో వాయిదా పడిన విక్రమసింహపురి యూనివర్శిటీ డిగ్రీ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈనెల 7వతేది నుంచి నిర్వహించనున్నట్లు విఎస్‌యు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ సాయి ప్రసాద్‌రెడ్డి గతనెల 30న ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త టైంటేబుల్‌ను విఎస్‌యు వెబ్‌సైట్‌లో ఉంచామని, విద్యార్థులు హాల్‌టికెట్లను సంబంధిత ప్రిన్సిపాల్ ద్వారా పొందవచ్చని ఆయన పేర్కొన్నారు.

---

వీక్షణం

- మంజీర

# గ్రేటర్ 2020

కులం, మతం, జాతి, ప్రాంతం... మనుషుల మధ్య ఏ విభజన రేఖలైతే రాకూడదో అదే విభజన రేఖల మధ్య జీవిస్తున్నాడు ఆధునిక మానవుడు. ఆధునికత అంతా సాంకేతిక ప్రగతికే పరిమితమవుతోంది తప్ప మానసిక పరిణతి, ఆలోచనల్లో పరిపక్వత, వ్యక్తిత్వంలో ఔన్నత్యాల పురోగతి మృగ్యమైందనే అనిపిస్తోంది. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ గ్రేటర్ హైదరాబాద్ నగరపాలక ఎన్నికలే. మనుషులను కలుపుతున్న బంధమూ, విడదీస్తున్న సాధనమూ రెండూ మతమే.

### ప్రధానంగా ముగ్గురే

గ్రేటర్ హైదరాబాద్‌లో డివిజన్‌లు 150, ఓటర్లు దాదాపుగా 75 లక్షల మంది. ప్రధాన పార్టీలతోపాటు స్వతంత్రులు అందరూ కలిసి 1122 మంది అభ్యర్థులు పోటీ పడ్డారు. టీడీపీ, సీపీఐ, సీపీఎంలు ఎన్నికలు బరిలో ఉన్నాయనే సంగతి ఓటర్లకు పట్టడమే లేదు. కాంగ్రెస్ బరిలో ఉంది కానీ యాభై వేలు వరద సహాయం హామీతో... అవన్నీ ఎలాగూ గెలవరని తెలుస్తూ చెప్పిన ఉత్త (మ కుమార్) కబుర్లేననే అభిప్రాయం ఓటర్లలో కలిగిపోయింది. ఇక మిగిలింది టీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం.

### నోరు జారిన ఒవైసీ

బీహార్ ఎన్నికల్లో ఆర్‌జేడీ వంటి పార్టీలు ఎంఐఎమ్ మీద చల్లిన బురదను తుడుచుకునే ప్రయత్నం హైదరాబాద్‌లో చేస్తోంది ఆ పార్టీ. ఎంఐఎమ్ – బీజేపీలు పైకి మాత్రమే ప్రత్యర్థులు, లోపల అంగీకారంతో పని చేస్తాయనే ఆరోపణలు చేశారు బీహార్ సీనియర్ రాజకీయ నాయకులు. ఆ అపప్రథను తొలగించుకునే ప్రయత్నంలో భాగంగా ఒవైసీ సోదరులు గ్రేటర్ ఎన్నికలలో ఘాటుగా, కొన్ని సార్లు వెగటుగా కూడా స్పందించారు. పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ విగ్రహాలు హైదరాబాద్‌లో ఉండాల్సిన అవసరం ఏమిటన్నారు. ఒవైసీలకు ధీటుగా బదులిస్తూ... మజ్లిస్ వ్యాఖ్యలు ఓటర్ల మెదళ్లలో నాటుకునేటట్లు ఎక్కడికక్కడ స్కిట్‌లతో రంజింప చేశారు బీజేపీ నాయకులు. మజ్లిస్ భుజం మీద గన్ను పెట్టి టీఆర్ఎస్‌ను షూట్ చేయాలనుకుంటోంది బీజేపీ. టీఆర్ఎస్‌కు ఓటేస్తే ఎంఐఎమ్‌కు ఓటేసినట్లేనని కొత్త వాదనకు తెరలేపారు కమలనాథులు. ఇందుకు వాళ్లు చూపిస్తున్న కొన్ని ఆధారాలను పరిశీలిస్తే నిజమేనని ఒప్పుకోక తప్పని పరిస్థితి. ఎంఐఎమ్ పోటీ చేస్తున్న స్థానాల్లో టీఆర్ఎస్ నామమాత్రంగా అభ్యర్థిని నిలుపుతుందని, అక్కడ టీఆర్ఎస్ ప్రచారం కూడా చేయదని చెప్తూ... పోటీ అంటే ఇదీ అంటూ మజ్లిస్‌కి పట్టున్న స్థానాల్లో కసిమీదున్న అభ్యర్థులను నిలిపింది బీజేపీ. ఆ సీట్లను బీజేపీ తమ ఖాతాలో వేసుకుంటుందని చెప్పలేం, కానీ అభ్యర్థుల ఎంపిక తీరులో బీజేపీ విజయం సాధించిందనే చెప్పాలి. ఒవైసీల ధోరణి పట్ల ఆవేశం, ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్న కుటుంబాల నుంచి అభ్యర్థుల్ని ఎంపిక చేసింది బీజేపీ. 'మజ్లిస్ గెలుపు మేము వేసిన ఓట్ల వల్ల కాదు, వాళ్లు గుద్దుకున్న ఓట్లతోనే. ఇకపై ఇవి సాగవు. ప్రధాని మోదీ తలాక్ చట్టం తెచ్చినందుకు మా కుటుంబాల్లో మహిళలు సంతోషంగా ఉన్నారు. ఓట్ల ద్వారా మా అభిమానాన్ని చాటుకుంటాం' అని కెమెరా ముందు చెప్పారు పాతబస్తీలో ఓ సీనియర్ నాయకుడు.

### మతం రంగు

మజ్లిస్–బీజేపీలు రెండూ మతం రంగు అద్దుకున్న పార్టీలే కాబట్టి నేరుగా ఆరోపణలు చేసుకున్నాయి. అయితే, మతం రంగు పైకి కనిపించని టీఆర్ఎస్ కూడా ఏ రంగు అద్దుకోవాలో తెలియక తంటాలుపడింది. 'కేసీఆర్‌ను మించిన హిందువు మరెవరు?' అంటూ ఓ పత్రిక... కేసీఆర్ చండీయాగం కోసం కాషాయదుస్తులు ధరించిన ఫోటోలను ప్రచురించింది. మరోవైపు కేటీఆర్ సెక్యులర్ మంత్రోచ్చారణ చేశారు. మత పార్టీలకు ఓటేస్తే నగరంలో మత ఘర్షణలను రేకెత్తిస్తారని, హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న ప్రశాంతమైన వాతావరణం నశిస్తుందని ఓటర్లను భయపెట్టారు కేటీఆర్. ఓటర్లను భయపెట్టడానికి కూడా వెనుకాడకపోవడం వెనుక ఉన్నది గెలుపు భయమే కావచ్చు. నిజానికి టీఆర్ఎస్‌కు మేయర్ సీటు భయం అక్కర్లేదు. ఆ సంగతి కేసీఆర్, కేటీఆర్‌తోపాటు మజ్లిస్ బీజేపీకి కూడా తెలుసు. టీఆర్ఎస్‌కి ఎక్స్ అఫిషియో సభ్యులున్నారు. నూటా యాభైకి గాను నలభై సీట్లు గెలుచుకున్నా చాలు. అయితే అసలైన ఓటమి అక్కడే ఉంది. తెలంగాణ తెచ్చిన పార్టీ, రాష్ట్రంలో రెండో దఫా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన పార్టీ... గ్రేటర్ ఎన్నికల్లో మేయర్ సీటును కైవసం చేసుకోవడానికి ఎక్స్ అఫిషియో సభ్యుల సంఖ్యలతో లెక్కలు వేసుకోవాల్సి రావడమే టీఆర్ఎస్‌కు మింగుడుపడని పరిస్థితి.

### వ్యతిరేక ఓటు

గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో ఈ దఫా 'మతం' ప్రధాన పాత్ర పోషిస్తున్న మాట నిజమే. తమ 'జాతీయత' అజెండా వెనుక హిందూత్వ కాషాయమే కనిపిస్తుందనే స్పష్టత బీజేపీకి ఉంది. అయితే బీజేపీకి పడుతున్న ఓట్లలో ఎక్కువ శాతం యాంటీ టీఆర్ఎస్, యాంటీ మజ్లిస్ ఓట్లే. అలాగే నగరంలో యాంటీ బీజేపీ ఓట్ కూడా చెప్పుకోదగిన స్థాయిలోనే ఉంది. అయితే ఈ రాజకీయ చిత్రంలో బీజేపీకి లాభిస్తున్న అంశం ఒకటుంది. యాంటీ బీజేపీ ఓట్లలో కొన్ని కాంగ్రెస్‌కి, కొన్ని మజ్లిస్‌కి, కొన్ని టీఆర్ఎస్‌కూ పడవచ్చు. యాంటీ టీఆర్ఎస్ ఓట్లు మాత్రం గంపగుత్తగా బీజేపీకి పడవచ్చు. కాంగ్రెస్‌కి సంప్రదాయ ఓటర్లు మాత్రమే ఉన్నారు. న్యూట్రల్ ఓటరు కాంగ్రెస్ పట్ల ఆసక్తి చూపించడం లేదు. ముఖ్యంగా టీఆర్ఎస్ మీద వ్యతిరేకత ఉన్న ఓటర్లు కాంగ్రెస్ పట్ల మొగ్గు చూపించడం లేదు. కారణం ఏమిటంటే... కాంగ్రెస్‌లో గెలిచిన వాళ్లు తిరిగి టీఆర్ఎస్ గూటికే చేరతారేమోననే అనుమానమే.

### సెక్యులర్ హిందువు

సెక్యులర్ భావజాలంతో ఉన్న హిందువులు కూడా ఈ దఫా బీజేపీ వైపు చూస్తున్నారు. బీజేపీ రాజకీయ వ్యూహమే ఇందుకు కారణం. మజ్లిస్–టీఆర్ఎస్ ఒకటేనని వేసిన పాచిక బలంగా పని చేసింది. టీఆర్ఎస్ తనకు తెలియకుండానే బీజేపీ పన్నిన మతం పన్నాగంలో పడిపోయింది. ముస్లిం ఓటు బ్యాంకు జారిపోకుండా పట్టుకోవడానికి శ్రమించడం మొదలుపెట్టింది. ఈ కసరత్తులో మెజారిటీ హిందువులను మర్చిపోయింది టీఆర్ఎస్. తమది మత పార్టీ కాదని చెప్పుకుంటే క్రిస్టియన్, పార్సీ, సిక్కు, జైనుల వంటి ఇతర మతాల ఓటర్లు తమకే మద్దతిస్తారని ప్రతి వ్యూహం పన్నింది. అయితే మినీ ఇండియా వంటి హైదరాబాద్‌లో నివసిస్తున్న ఇతర రాష్ట్రాల వారిలో గుజరాతీలది పెద్ద ఓటు బ్యాంకు. హైదరాబాద్‌లో ఉన్న ఉత్తరాది హిందువులతోపాటు సిక్కులు, జైనులు కూడా బీజేపీకి ఓటు వేయడం అంటే 'భారతీయతకు ఓటు వేయడం' అంటారు. వాళ్లు హిందూత్వను భారతీయతను వేరు చేసి చూడడం లేదు. బీజేపీ–మజ్లిస్‌లు రెండు మతాలకు ప్రతీకలుగా ఢీ కొన్న ఈ ఎన్నికల్లో... టీఆర్ఎస్ ఆ రెండు పార్టీల మధ్య నలిగిపోతున్నది. తెలంగాణ సెంటిమెంట్ పలచబడిపోయింది. 'భారతీయత' సెంటిమెంట్ బలం పుంజుకుంటోంది. హిందువుల గురించి మాట్లాడితే మతం రంగు అంటుతుందేమో, సెక్యులర్ రంగు మాసిపోతుందేమోనని భయపడుతోంది టీఆర్ఎస్. దాంతో మతం అంటే పెద్దగా పట్టని సెక్యులర్ ఇండియాను కోరుకునే హిందువు కూడా ఈ సారి 'తాను హిందువు'నని గుర్తు చేసుకుంటున్నాడు.

# కరెంటు ఎస్ఇకి.. ఏసిబి షాక్

## ఊచలు లెక్కబెడుతున్న విజయకుమార్



విద్యుత్ శాఖలో చక్రం తిప్పుతున్న అవినీతి తిమింగిలానికి ఏసిబి అధికారులు షాకిచ్చారు. సూపరింటెండెంట్ ఇంజనీరుగా పనిచేస్తున్న విజయ కుమార్‌రెడ్డి ఇంటిపై అవినీతి శాఖ అధికారులు బుధవారం దాడి చేశారు. నెల్లూరు, ఆదిత్యనగర్‌లో ఉన్న ఆయన స్వగృహంతో పాటు ఆయన సమీప బంధువుల ఇళ్ళల్లో కూడా ఒకేసారి దాడి చేశారు. బుధవారం సాయంత్రం వరకు లభించిన సమాచారం మేరకు 3కోట్లకు పైగానే అక్రమ సంపాదన గుర్తించినట్లు అధికారులు చెప్పారు. ఇంకా కొన్ని లాకర్లు తెరవాల్సి ఉందని, గురువారం సాయంత్రానికిగాని పూర్తి వివరాలు ఇవ్వలేమన్నారు. విజయకుమార్‌రెడ్డి గత మూడేళ్ళుగా జిల్లాలో పనిచేస్తున్నాడు. ప్రభుత్వం మారినా ఆయన మాత్రం కదలకుండా సీటుకే అతుక్కుపోయాడు. ఉద్యోగుల పట్ల కఠినంగా వ్యవహరిస్తాడు, అహంకారపు ధోరణితో ప్రవర్తిస్తాడని సిబ్బందే చెప్తున్నారు. ఎవరికో కడుపు మండినట్లుంది, పక్కా సమాచారంతో ఇరికించారు. అందుకే నోరు మంచిదైతే ఊరు మంచిదంటారు. తాను కూడా క్రిందిస్థాయి నుండే వచ్చానన్న సంగతి మర్చిపోయి విర్రవీగితే.. ఫలితం ఇలాగే ఉంటుంది. ప్రస్తుతం విజయకుమార్‌రెడ్డి ఊచలు లెక్కబెడుతుంటే ఏసిబి అధికారులు ఆయన అవినీతి సొమ్మును లెక్కబెడుతున్నారు. ఇంకా పూర్తిగా లెక్కలు తేలాల్సి ఉందని చెప్తున్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు










1920 2018

# ద్వితీయ వర్ధంతి



మా ఇంటి దీపం.. ప్రేమానురాగాల ప్రతిరూపం

**శ్రీ ఆదాల శంకరరెడ్డి గారు**

పరమపదించి తేది.07.12.2020 నాటికి రెండేళ్ళు గడవనున్న సందర్భంగా ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

వారి పవిత్ర ఆత్మ శాంతికై ప్రార్థిస్తూ...

భార్య
**ఆదాల సుశీలమ్మ**

కుమారులు
**ఆదాల ప్రభాకర్‌రెడ్డి**
పార్లమెంటు సభ్యులు, నెల్లూరు
**ఆదాల మురళీకృష్ణారెడ్డి**

కుమార్తెలు
**గునుపాటి శ్యామల**
**బిరుదవోలు జలజ**

మనుమడు
**ఆదాల వంశీకృష్ణారెడ్డి**


Edited, Published, Printed & Owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Managing Editor : T.BHARATHI REDDY, e-mail: lawyerpatrika@gmail.com